

సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎలా మేలు జరిగిందో... సంస్కరణలతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని -సూపర్ జీఎస్టీగా మార్చింది. 2047 నాటికల్లా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యాల సాధనకు జీఎస్టీ సంస్కరణలు, సూపర్ సిక్స్ , పీ4 కార్యక్రమాలు శక్తివంతంగా పని చేస్తాయి.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శనివారం 27.09.2025


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 162 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# ఏపీ బ్రాండును పునరుద్ధరించాం



**• 15 నెలల్లో 4,71,574 ఉద్యోగాలు • ఎస్ఐపీబీల ద్వారా రూ. 6.23 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం**

**• లాజిస్టిక్స్ రంగమే రాష్ట్రానికి చోదక శక్తి • మౌలిక సదుపాయాల కల్పనకు బ్లూ ప్రింట్**

**• త్వరలో శ్రీశైల దేవస్థానానికి ప్రధాని మోదీ • ఏపీ శాసన సభలో పెట్టుబడులు, ఉద్యోగాలు, లాజిస్టిక్స్ పై సీఎం చంద్రబాబు**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 15 నెలల్లో కాలంలో 4,71,574 మందికి ఉద్యోగాలు కల్పించామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కలిపి మొత్తంగా ఈ ఉద్యోగాలు కల్పించామని... 20 లక్షల ఉద్యోగాల కల్పన సాధన దిశగా అడుగులు వేస్తున్నామని సీఎం చెప్పారు. శుక్రవారం అసెంబ్లీలో లాజిస్టిక్స్, పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు కల్పించిన ఉద్యోగాల వివరాలతోపాటు... మౌళిక వసతుల కల్పన... లాజిస్టిక్స్ కోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలను సీఎం వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."మెగా డీఎస్సీ ద్వారా 15941, వివిధ ప్రభుత్వ విభాగాల్లో మొత్తంగా కలిపి 9093, పోలీస్ శాఖలో 6100 మందికి ఉద్యోగాలు కల్పించాం. స్కిల్ డెవలప్మెంట్ – జాబ్ మేళాల ద్వారా 92,149 మందికి ఉద్యోగాలు వచ్చాయి. వర్క్‌ఫ్రం హెూం ద్వారా 5500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం. మొత్తంగా ప్రైవేట్ రంగంలో మొత్తంగా 3,48,891 మందికి ఉద్యోగాలు కల్పించినట్టు చెప్పిన చంద్రబాబు. ప్రైవేట్ సెక్టారులో పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం, ఐటీ, ఎంఎంస్ఎంఈలు, పునరుత్పాదక విద్యుత్ రంగాల్లో మొత్తం 3.48 లక్షల కల్పించాం. తాము కల్పించిన ఉద్యోగాల వివరాలను కూడా పూర్తిగా ఆన్ లైన్లో అందుబాటులో ఉంచుతాం. ఎవరు ఎక్కడ, ఎప్పుడు ఉద్యోగం పొందారు, ఏ జాబ్ చేస్తున్నారు అనే సమస్త వివరాలను పోర్టల్ ద్వారా కూడా వెల్లడిస్తాం. గత పాలకులు ఐదేళ్ల కాలంలో కేవలం 13 ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించారు. కూటమి అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే 10 రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశాలు జరిగాయి. తద్వారా రూ. 6.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 6.29 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే గత ప్రభుత్వం సాధించిన దానికంటే మూడు రెట్ల మేర పెట్టుబడులు సాధించాం. 125 ప్రాజెక్టుల్లో రూ. 6.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ కంపెనీ, భారత్ పెట్రోలియం, ఎల్జీ, ఐబీఎం, టీసీఎస్, గూగుల్, ఎన్టీపీసీ, రిలయన్స్ లాంటి ప్రతిష్టాత్మ సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయి." అని ముఖ్యమంత్రి ప్రకటించారు.

**లాజిస్టిక్స్ అభివృద్ధి కోసం బ్లూ ప్రింట్ :** "లాజిస్టిక్స్ రంగం గురించి గతంలో ఎప్పుడూ ఈ స్థాయిలో మాట్లాడలేదు. భవిష్యత్తులో లాజిస్టిక్స్ కల్పనతో ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. వస్తు రవాణా, ప్రయాణికుల రవాణా లాంటి మాధ్యమాలను మరింత అభివృద్ధి చేయాల్సి ఉంది. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారి మార్గాలు, రైల్వే ఇలా వేర్వేరు రంగాలను విస్తృతం చేయాలి. భారత్ దేశంలో లాజిస్టిక్స్ వ్యయం రూ. 24.01 లక్షల కోట్లుగా ఉంది. జీ డీ పీ లో లాజిస్టిక్స్ వాటా 7.97 శాతంగా ఉంది. రవాణా రంగంలో రహదారి ద్వారా జరిగే రవాణా 41 శాతం మేర వాటా కలిగి ఉంది. లాజిస్టిక్స్ కు అయ్యే వ్యయాన్ని తగ్గించగలిగితే ఉత్పత్తి వ్యయం కూడా తగ్గుతుంది. ఇది ఉత్పత్తి దారులకు, వినియోగదారులకూ అందరికీ ప్రయోజనం చేకూరుస్తుంది. వస్తు రవాణా తూర్పు కోస్తా తీరంలో ఉన్న ఏపీ ఓ కీలకమైన ప్రాంతం. లాజిస్టిక్స్ మేనేజ్మెంట్ ఎకో సిస్టంలో రైలు, రోడ్డు, జల రవాణాతో పాటు పైప్ లైన్ మార్గం కూడా కీలకంగా మారింది. పైప్ లైన్ ద్వారా గ్యాస్, నీరు, స్లర్రీ లాంటివి రవాణా చేసేందుకు ఆస్కారం ఉంది. మల్టీమోడల్ ట్రాన్స్ పోర్టు సిస్టం ద్వారా హైయ్యర్ కార్గో రవాణా చేస్తే వ్యయం తక్కువ అవుతుంది. ప్రస్తుతం డ్రై పోర్టుల ప్రాజెక్టులు కూడా పెద్ద ఎత్తున వస్తున్నాయి. లాజిస్టిక్స్ ఎకో సిస్టంలో మౌలిక సదుపాయాలే ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. దీని కోసం ఓ బ్లూ ప్రింట్ తయారు చేసి వ్యయం తగ్గించటమే లక్ష్యంగా పని చేస్తాం." అని సీఎం వివరించారు.

**గుంతలు పూడ్చాం... జాతీయ రహదారులు అభివృద్ధి చేశాం :** "గత ప్రభుత్వ హయాంలో గుంతలు పడిన రోడ్లను మేం అధికారంలోకి వచ్చాక యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేశాం. పోర్టులను అనుసంధానించేలా రహదారులను అభివృద్ధి చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. దేశంలోని వివిధ ప్రాంతాలను అనుసంధానించేందుకు చేపట్టిన గోల్డెన్ క్వాడ్రిలేటరల్ దేశానికే మణిహారంగా నిలిచింది. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో 14,966 కిలోమీటర్ల రహదారులను రూ. 4500 కోట్లతో త్వరలోనే చేపడతాం. జాతీయ రహదారులు రూ. 1.50 లక్షల కోట్ల ప్రాజెక్టులు రాష్ట్రంలో జరుగుతున్నాయి. మిగతా 2లో...

## యోగా కోసం ప్రత్యేక పరిషత్

**• విశాఖ, విజయవాడ, ఒంగోలు, తిరుపతిలో ప్రచార కేంద్రాలు**





**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో యోగ ప్రచార పరిషత్ (ఏపీవైపీపీ) ఏర్పాటుకాబోతుంది యోగా, ప్రకృతి వైద్యం, పరిశోధనలు ప్రోత్సహించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలకు ఉపక్రమించింది. దీని ఏర్పాటుకు సుమారు రూ. 10 కోట్ల వరకు వ్యయమవుతుందని అంచనా వేశారు పరిషత్ ఏర్పాటుకు అనుగుణంగా రాష్ట్రంలో విశాఖ, విజయవాడ, ఒంగోలు, తిరుపతి కేంద్రాలుగా ప్రచార కేంద్రాలు ఏర్పాటవుతాయి. పరిషత్ చైర్మన్ గా వైద్యారోగ్య శాఖా మంత్రి వ్యవహరిస్తారు. ఇందులో పలువురు నిష్ణాతులు సభ్యులుగా ఉంటారు. యోగా, ప్రకృతి వైద్యం, ప్రజారోగ్యం రంగాలకు చెందిన నిపుణులతో విడిగా ప్యానల్ల కమిటీలు ఏర్పాటవుతాయి.

**విస్తృత ప్రయోజనాలే లక్ష్యంగా... :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైదరాబాద్ లోని యోగాధ్యయన పరిషత్ ను ఏపీ పునర్వ్యస్థీకరణ చట్టం-2014లోని పదో షెడ్యూలులో చేర్చారు. పర్యవసానంగా, భౌగోళికంగా హైదరాబాదులో ఉన్న 4 యూనిట్లు తెలంగాణ రాష్ట్ర పరిధిలోకి వెళ్లాయి. దీంతో రాష్ట్రంలో యోగా, ప్రకృతి వైద్యం, పరిశోధనల్ని ప్రోత్సహించేందుకు యూనిట్లు లేవు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ సహకారంతో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు-2025 రాష్ట్రంలో విజయవంతంగా జరిగాయి.


**ప్రణాళికను సిద్ధం చేసిన ఆయుష్ శాఖ :** యోగాంధ్ర-2025 ప్రచార సమీక్ష సమావేశాల సందర్భంగా సీఎం చంద్రబాబు రాష్ట్రంలో ప్రకృతి వైద్యం, యోగా ప్రయోజనాలు, పాఠశాల విద్యలో యోగాను సిలబస్ గా ప్రవేశపెట్టేందుకు వీలుగా ప్రత్యేకంగా యోగా పరిషత్ ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించారు. మిగతా 2లో...

## అమరావతిలో ఇండియా ఇంటర్నేషనల్ లీగల్ యూనివర్సిటీ

**2025-26 విద్యాసంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభిస్తాం**

**శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి నారా లోకేష్**

**పరిశోధనల ప్రోత్సహానికి ప్రైవేటు వర్సిటీల సవరణ బిల్లు**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ గారు వ్యక్తిగతంగా తీసుకుని ఏపికి IIULER మంజూరు చేయించారు. శాసనసభ తరపున గవర్నర్‌కి ధన్యావాదాలు. ఈ యూనివర్సిటీని అమరావతిలో ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. దీనికి అనుబంధంగా అసోసియేట్ ఇనిస్టిట్యూషన్స్ (ఆర్బిట్రేషన్ సెంటర్, మీడియేషన్, కన్సల్టేషన్ సెంటర్ ఫర్ కంటిన్యూయింగ్ లీగల్ ఎడ్యుకేషన్, జ్యుడీషియల్ ట్రైనింగ్ సెంటర్) ఏర్పాటు చేయాలని నిర్ణయించామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ , ఎపి ప్రైవేట్ విశ్వవిద్యాలయాల స్థాపన,

### పాలిటెక్నిక్ కళాశాలలకు సొంత భవనాలు

**అడ్మిషన్లు పెంచేందుకు వచ్చేఏడాది నుంచి కొత్త కోర్సులు**

**శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్**

## ఆడబిడ్డ నిధి అమలుపై పరిశీలన

**• 18 ఏళ్లు దాటిన మహిళలకు వర్తింపు**

**• కసరత్తు చేస్తున్న ప్రభుత్వం**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి సూపర్ సిక్స్ హామీల పేరుతో ప్రజలకు వరాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది ఎన్డీఏ కూటమి ప్రభుత్వం.

ఇందులో భాగంగా ఇప్పటి వరకూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్లు , మెగా డీఎస్సీ, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లు , స్త్రీ శక్తి పథకాలను ఏపీ ప్రభుత్వం అమలు చేసింది. అయితే సూపర్ సిక్స్ పథకాలు అన్నింటిలో కీలకమైన ఆడబిడ్డ నిధి పథకం గురించి ఏపీలోని మహిళలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి పథకం కింద 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ. 1500 చొప్పున్ అకౌంట్లలో జమ చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ పథకం ఎప్పుడు అమలు చేస్తారా అని మహిళలు అమలు చేస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే ఏపీలో ఆడబిడ్డ నిధి పథకం అమలుపై కీలక అప్ డేట్ వచ్చింది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అసెంబ్లీ వేదికగా ఆడబిడ్డ నిధి పథకం అమలుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆడబిడ్డ నిధి పథకం అమలు కోసం పరిశీలన జరుగుతోందని మంత్రి వివరించారు. అంచనాలు వేస్తున్నట్లు వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం లోటు బడ్జెట్ ఇచ్చినప్పటికీ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లికి వందనం, పింఛన్ల పెంపు, స్త్రీ శక్తి వంటి పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఆడబిడ్డ నిధి పథకం విధివిధానాలను ఖరారు చేయాల్సి ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అసెంబ్లీలో వెల్లడించారు.

## త్వరలో ఉచిత సివిల్ సర్వీసెస్ కోచింగ్

**• రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**


**• వంద మంది బీసీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్**

**• ఏటా డీఎస్సీ నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం**

**• డీఎస్సీకి కూడా ఉచిత కోచింగ్ అందజేస్తాం : మంత్రి సవిత**

**• మంత్రి సవితను సత్కరించిన స్టడీ సర్కిల్ ఉద్యోగులు**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** బీసీ స్టడీ సర్కిల్ ద్వారా త్వరలో సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ ప్రారంభించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. శుక్రవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నాలుగో బ్లాక్ లో మంత్రి సవితను ఏపీ బీసీ స్టడీ సర్కిల్ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. బీసీ సంక్షేమ శాఖకు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు వచ్చినందుకు గానూ మంత్రిని వారు సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో వివిధ పోటీ పరీక్షలకు మిగతా 2లో...



## ఆటో-క్యాబ్ డ్రైవర్లకు కానుక

**• అక్టోబర్ 2న డ్రైవర్ల ఖాతాల్లో రూ.15 వేల జమ**

**• గాంధీ జయంతి సందర్భంగా**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతీ ఏటా ఆటో – క్యాబ్ డ్రైవర్లకు రూ 15 వేల జమ కోసం కొత్త పథకం ప్రకటించింది. ఈ పథకానికి ఆటో డ్రైవర్ల సేవలో అనే పేరు ఖరారు చేసారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకానికి అర్హతల విధి విధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు లబ్ది దారుల ఎంపిక పూర్తి చేసారు. కాగా, దసరా వేళ ఈ పథకం నిధులు అర్హుల ఖాతాల్లో జమ చేయాలని భావించినా.. ఇప్పుడు అధికారికంగా డ్రైవర్ల ఖాతాల్లో నిధుల జమ ముహూర్తాన్ని ప్రభుత్వం ప్రకటించింది. అర్హుల జాబితాలు సిద్ధమయ్యాయి. ఏపీ ప్రభుత్వం ఆటో – క్యాబ్ డ్రైవర్ల ఖాతాల్లో రూ 15 వేలు జమ చేసేందుకు ముహూర్తం ఖరారు చేసింది. ఈ పథకం కోసం మొత్తం 3,10,385 మందిని అర్హులుగా అధికారులు గుర్తించినట్లు తెలిసింది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2న వీరి ఖాతాల్లో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నిధులు జమ చేస్తారు. ఈ పథకం అమలుతో రాష్ట్ర ఖజానాపై రూ. 466 కోట్ల భారం పడుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే స్త్రీ శక్తి పథకాన్ని ఆగస్టు 15నుంచి అమలు చేశారు. దీని కారణంగా తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతోందని ఆటో, క్యాబ్ డ్రైవర్లు విన్నవించడంతో వారికి ఆర్థిక సాయం అందిస్తామని సీఎం చంద్రబాబు అనంతపురం సభలో ప్రకటించారు. ఈ మేరకు ఇప్పటికే క్షేత్ర స్థాయి పరిశీలన తరువాత అర్హుల జాబితా ఖరారు చేసారు.

**సాంఘిక సంక్షేమ శాఖలో**

## విప్లవాత్మక మార్పులు

**రూ. 143 కోట్లతో సంక్షేమ వసతి గృహాలకు మరమ్మత్తులు**

**మరో రూ. 104 కోట్లతో నూతన హాస్టళ్ల నిర్మాణం**

**మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాంఘిక సంక్షేమశాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం నాడు శాసనసభలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. ఈ సంధర్బంగా మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.... విశాఖ జిల్లా పెందుర్తిలో బాలికల కాలేజీ వసతి గృహ నిర్మాణం కోసం రూ. 3 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. పెందుర్తిలోని బాలికల వసతి గృహానికి రూ. 8.65 లక్షలతో, బాలుర కాలేజీ వసతి గృహానికి రూ. 13.20 లక్షలతో మరమ్మతులు చేశామని మంత్రి తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 143 కోట్లతో రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో మరమ్మతులు చేశామన్నారు. టాయిలెట్ల నిర్మాణానికి ప్రత్యేకంగా రూ. 23 కోట్లు కేటాయించామన్నారు. మరో రూ. 104 కోట్లతో నూతన హాస్టళ్లు నిర్మిస్తున్నామని మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

# యోగా కోసం ప్రత్యేక పరిషత్

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు ఆయుష్ అధికారులతో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆయుష్ అధికారులతో విపులంగా చర్చించారు. అనంతరం పరిషత్ ఏర్పాటు, కార్యకలాపాల నిర్వహణ, కమిటీల ఏర్పాటు ఎలా ఉండాలన్న దానిపై ఆయుష్ శాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. వార్షిక వ్యయం కింద రూ. 5 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేసింది. సుమారు 70 మంది వరకు సిబ్బంది. నిపుణులు అవసరమవుతారని అంచనా.

**రాష్ట్రంలో 4 ప్రచార కేంద్రాలు :** సొసైటీ రిజిస్ట్రేషన్ చట్టం కింద పరిషత్ ఏర్పాటవుతుంది. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నుంచి అదనంగా గ్రాంట్లు పొందే వీలుంది. ఈ పరిషత్ ద్వారా ఆరోగ్య సంరక్షణ నిపుణులు, అభ్యాసకులకు యోగా, ప్రకృతి వైద్యంపై శిక్షణ తరగతులు, పరిశోధలు జరుగుతాయి. రాష్ట్ర ప్రజల్లో యోగా, ప్రకృతి వైద్యం ప్రాధాన్యతపై అవగాహన పెంచడమే ధ్యేయంగా పరిషత్ కార్యకలాపాలుంటాయి. ఆరోగ్య సంరక్షణ, జీవనశైలి విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలో 26 జిల్లాలకు కలిపి విశాఖ, విజయవాడ, ఒంగోలు, తిరుపతి లలో అధ్యయన, ప్రచార కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి.

విశాఖపట్నం ప్రచార కేంద్రం పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలున్నాయి.

విజయవాడ కేంద్రం పరిధిలో కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలున్నాయి

ఒంగోలు కేంద్రం పరిధిలో పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలున్నాయి

తిరుపతి కేంద్రం పరిధిలో కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలున్నాయి.

# త్వరలో ఉచిత సివిల్ సర్వీసెస్ కోచింగ్

(మొదటి పేజీ తరువాయి)

బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా త్వరలో సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్ ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత తొలి విడతగా 83 మందికి సివిల్ సర్వీసెస్ కోచింగ్ అందజేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఇప్పుడు మరో బ్యాచ్ కు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ బ్యాచ్ లో వంద మంది వరకూ ఉంటారని తెలిపారు. అమరావతిలో అయిదు ఎకరాల్లో బీసీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణం చేపట్టనున్నామన్నారు. ప్రభుత్వం ఏటా డీఎస్సీ నిర్వహించాలని నిర్ణయించిందని, బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా బీసీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత కోచింగ్ కూడా అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో 270 మంది బీసీ అభ్యర్థులు టీచర్లగా ఎంపిక కావడానికి కృషి బీసీ స్టడీ సర్కిల్ సిబ్బందిని మంత్రి సవిత అభినందించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రి సవితకు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం అందజేశారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ కళాశాలలకు సొంత భవనాలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రవ్యాప్తంగా 10 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు సొంత భవనాలు లేవు, 2 పాలిటెక్నిక్ కళాశాలలకు సంబంధించి కూటమి ప్రభుత్వం వచ్చాక భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన వాటిలో అయిదింటికి (చోడవరం, పొన్నూరు, బేతంచర్ల, మైదుకూరు, గుంతకల్లు), భూములు కేటాయించాం, మరో మూడింటికి (మచిలీపట్నం, కెఆర్ పురం, అనపర్తి)లకు భూములు కేటాయించాల్సి ఉంది. కేంద్రప్రభుత్వంతో చర్చించి రాష్ట్రప్రభుత్వం, ఎంపి లాడ్స్, సిఎస్ఆర్ నిధులను అనుసంధానించి సొంత భవనాల నిర్మాణం పూర్తిచేస్తామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. రాష్ట్రంలో ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కళాశాలలకు సొంత భవనాలు నిర్మించే ప్రతిపాదనలపై అసెంబ్లీ సమావేశాల ఏడోరోజు ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు పుట్టా సుధాకర్ యాదవ్, అయితాబత్తుల ఆనందరావు, మద్దిపాటి వెంకటరాజు అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేష్ సమాధానమిచ్చారు. బి.మఠం నవోదయ స్కూలును తాత్కాలిక భవనాల్లో ప్రారంభించే విషయమై కేంద్ర మంత్రితో మాట్లాడతాం. కోనసీమ హయ్యర్ ఎడ్యుకేషన్ లో వెనుకబడి ఉంది. అందుకే అక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేశాం, త్వరలోనే పూర్తిచేస్తాం. కోనసీమలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసే అంశంపై చర్చిస్తాం. పాలిటెక్నిక్ లలో అడ్మిషన్లు 70శాతంగా ఉన్నాయి. కన్వెన్షనల్ కోర్సులకు ఎవరూ రావడం లేదు. కోర్సులను రీడిజైన్ చేయాల్సి ఉంది. మార్కెట్ లింక్, ఓరియంటెడ్ కోర్సులను తీసుకురావాల్సి ఉంది. వచ్చే అకడమిక్ ఇయర్ లో లేటెస్ట్ కోర్సులను తీసుకువచ్చి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి లోకేష్ చెప్పారు.

పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ...మైదుకూరు పాలిటెక్నిక్ కళాశాలలో 540మంది కెపాసిటీ ఉండగా, 120మంది విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. ఇక్కడ నూరుశాతం టీచింగ్ స్టాఫ్ ఉన్నారు. సొంత భవనం ఏర్పాటుచేస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. అదేవిధంగా బ్రహ్మంగారిమఠం మండలంలో నవోదయ స్కూలు మంజూరైంది. అక్కడ ఖాళీగా ఉన్న భవనంలో ఈ సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభిస్తే విద్యార్థులు చదువుకోవడానికి అవకాశమేర్పడుతుందని అన్నారు. అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ... అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అయిదు అసెంబ్లీ నియోజకవర్గాలు కోనసీమ దీవిలో ఉన్నాయి. ఇందులో 3 అసెంబ్లీలు పక్కపక్కనే ఎస్సీ నియోజకవర్గాలు. ఇక్కడ ప్రభుత్వ పాలిటెక్నిక్ లేకపోవడం వల్ల విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేకపోతున్నారు. ఓఎన్ జిసి, గెయిల్, రిలయన్స్ కంపెనీల కార్యకలాపాలు కొనసాగుతున్నారు. విద్యాపరంగా మాది వెనుకబడిన జిల్లా. మొన్ననే డిగ్రీ కళాశాల ఇచ్చారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కూడా మంజూరు చేస్తే యువతకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ... 2024-25లో పాలిటెక్నిక్ కళాశాలల్లో 94శాతం సక్సెస్ రేటు ఉంది. ఇంత మంచి ఫలితాలు వస్తున్న పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్లు అనుకున్న స్థాయిలో ఉండటం లేదు. అడ్మిషన్లు పెంచగలిగితే విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని అన్నారు.

# మైదుకూరు నూతన కమీషనర్ గా బాధ్యతలు చేపట్టిన రంగస్వామి.




**మైదుకూరు (కడప జిల్లా) జర్నలిస్ట్ ఫైల్ :** మైదుకూరు మున్సిపల్ కమిషనర్ గా రంగస్వామి శుక్రవారం నాడు బాధ్యతలు చేపట్టారు ఈయన

గతంలో కూడా కమీషనర్ గా పనిచేసి ఉన్నారు.మైదుకూరు మున్సిపాలిటీ పై తనకు ముందు కుడా అవగాహన ఉందని ఆ అవగాహనతో అభివృద్ధి సమస్యలు పరిస్కారం కోసం కృషి చేస్తానన్న నూతన కమీషనర్ రంగస్వామి ఓ ప్రకటనలో తెలియజేశారు.

# ఏపీ బ్రాండును పునరుద్ధరించాం

(మొదటి పేజీ తరువాయి)



జాతీయ రహదారుల విషయంలో దేశంలో రెండో స్థానంలో ఏపీ ఉంది. రాష్ట్రంలో ప్రతీ 1000 చదరపు కిలోమీటర్లకు 53 కిలోమీటర్ల మేర జాతీయ తహదారులు ఉన్నాయి. ప్రతీ లక్ష మందికి 17 కిలోమీటర్ల జాతీయ రహదారులు రాష్ట్రంలో ఉన్నాయి. హైస్పీడ్ రోడ్ కారిడార్ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధిని మరో స్థాయికి తీసుకెళ్తాయి. హైదరాబాద్- అమరావతి- చెన్నై-బెంగుళూరు నగరాలను కలుపుతూ ఎలివేటెడ్ హైస్పీడ్ కారిడార్ (బుల్లెట్ ట్రైన్) ప్రాజెక్టు కూడా వస్తుంది. విశాఖ రైల్వే జోన్ ప్రాజెక్టును కూడా కూటమి ప్రభుత్వం వచ్చాకే భూమి ఇచ్చి ప్రారంభింపచేశాం. దీనికి ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలియచేస్తున్నా. గత ప్రభుత్వం వ్యవస్థలను భ్రష్టు పట్టించి ఇబ్బందులు తెచ్చింది. నేషనల్ హైవేలు, రైల్వే స్టేషన్ల ప్రాజెక్టులపై స్థానిక ప్రజాప్రతినిధులు కూడా శ్రద్ధ పెట్టాలి. అవి మనవి కావని అశ్రద్ధ చేయొద్దు. వీటి వల్ల స్థానిక ప్రజలకు మెరుగైన సౌకర్యాలు లభిస్తాయి. రూ. 2.50 లక్షల కోట్ల మేర లాజిస్టిక్స్ పై ఖర్చు పెట్టేందుకు అవకాశం ఏర్పడుతుంది." అని ముఖ్యమంత్రి చెప్పారు.

**వచ్చే ఏడాదికి కొత్త పోర్టులు, ఎయిర్ పోర్టులు సిద్ధం :** "1053 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతంలో 1 మేజర్ పోర్టు ప్రస్తుతం ఉంది. 5 ఆపరేషనల్ నాన్ మేజర్ పోర్టులు రాష్ట్రంలో ఉన్నాయి. 4 గ్రీన్ ఫీల్డ్ పోర్టులు నిర్మాణంలో ఉన్నాయి. ప్రస్తుతం 182 మిలియన్ టన్నుల కార్గోను మన పోర్టులు హ్యాండిల్ చేస్తున్నాయి. కొత్తగా అందుబాటులోకి వచ్చే 4 పోర్టులు మరో 100 మిలియన్ టన్నుల కార్గోను రవాణా చేసేందుకు ఆస్కారం ఉంది. దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ సెంటర్ రాబోతోంది. మూలపేట, రామాయపట్నం, మచిలీపట్నం పోర్టులు వచ్చే ఏడాది నాటికి అందుబాటులోకి వస్తాయి. అంతర్గత జల రవాణా మార్గాల ద్వారా పెద్ద ఎత్తున కార్గో రవాణాకు ఆస్కారం ఉంది. కాకినాడ, ఏలూరు కాలువలను అనుసంధానిస్తే అంతర్గత జల రవాణా మార్గాలు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 6 ఆపరేషనల్ ఎయిర్ పోర్టులు ఉన్నాయి. గత ప్రభుత్వం భోగాపురం ఎయిర్ పోర్టును పక్కన పెట్టేసి ప్రాజెక్టును వదిలేసింది. 2026 ఆగస్టు నాటికి భోగాపురం ఎయిర్ పోర్టు ఆపరేషనల్ ఎయిర్ పోర్టుగా మారుతుంది. అక్కడే మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్ హాలింగ్ కేంద్రం కూడా వస్తుంది. తద్వారా ఉత్తరాంధ్రకు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఎయిర్ పోర్టు నెట్వర్క్ను విస్తరించటం ద్వారా లాజిస్టిక్స్ కనెక్టివిటీని పెంచాలన్నది మా ప్రభుత్వ లక్ష్యం. అమరావతి ఎయిర్ పోర్టు నిర్మిస్తాం, అలాగే రాష్ట్రంలో కుప్పం, దగదర్తి, ఒంగోలు, తుని, శ్రీకాకుళంలోనూ ఎయిర్ పోర్టులు రానున్నాయి. అలాగే రాష్ట్రంలో సరకు నిల్వల కోసం గోదాములు, కోల్డ్ స్టోరేజీలు, మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుపై బ్లూప్రింట్ తయారు చేస్తున్నాం. ప్రాధాన్యతా క్రమంలో ఈ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం. ఏపీ లాజిస్టిక్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఇన్ ల్యాండ్ వాటర్, వేర్ హౌసింగ్ ఇలా వేర్వేరు మౌలిక సదుపాయాలను ఈ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తాం. ఈ లాజిస్టిక్స్ అంశంలో ప్రతిష్టాత్మక మెర్స్ అండ్ మార్ష్ సంస్థ ఏపీకి సహకారం అందించేందుకు ముందుకు వచ్చింది. ప్రస్తుతం 3 లక్షల మంది ఎలాంటి శిక్షణ లేకుండానే లాజిస్టిక్స్ రంగంలో పనిచేస్తున్నారు. రాష్ట్రంలో లాజిస్టిక్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తాం. అలాగే లాజిస్టిక్స్ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను కేటాయించేందుకు కూడా కేంద్రం అంగీకరించింది. ఏవియేషన్ రంగంలోనూ ఒక యూనివర్సిటీనీ విశాఖలో ఏర్పాటు చేయలని భావిస్తున్నాం. ఏరో స్పేస్, డిఫెన్స్, ఆటోమొబైల్, ఎనర్జీ, అగ్రో ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, ఐటీ లైఫ్ సైన్సెస్ తదితర రంగాలపై దృష్టి కేంద్రీకరించాం." అని చంద్రబాబు చెప్పారు.

**ఉద్యోగాలిస్తుంటే అడ్డుకుంటున్నారు :** "ఆటోమొబైల్ రంగంలో కియాలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థ ఏపీలో కార్లు ఉత్పత్తి చేస్తోంది. 2014 -19 మధ్య కియా కార్లను ఉత్పత్తి చేయటంతో పాటు ఓ మోడల్ టౌన్ షిప్ ను కూడా అభివృద్ధి చేసింది. ఇసుజు, హీరోమోటార్స్ లాంటి సంస్థలు కూడా టీడీపీ హయాంలోనే ఏపీకి వచ్చాయి. గత పాలకులు కియా మోటార్స్ అనుబంధ పరిశ్రమలు ఏపీకి వస్తే... వాటిని వేధించి పెట్టుబడులు పెట్టకుండా ఇతర రాష్ట్రాలకు పారిపోయేలా చేశారు. జాకీ సంస్థను కూడా రాష్ట్రం నుంచి తరిమేశారు. 2019-24 మధ్య పెట్టుబడిదారుల్లో నమ్మకం పోయింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వాతావరణం లేకుండా పోయింది. పీపీఏలు రద్దు చేశారు. గత ప్రభుత్వ వైఖరి దేశ ప్రతిష్ట దెబ్బతింది. ఇదే విషయాన్ని నాడు కేంద్ర ప్రభుత్వం కూడా చెప్పింది... పీపీఏల రద్దు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కేంద్రం చెప్పినా... నాటి పాలకులు వినలేదు. విద్యుత్ వినియోగించుకోకపోయినా ఆ కంపెనీలకు ఉత్తి పుణ్యాన చెల్లించాల్సి వచ్చింది. ప్రజా ధనం దుర్వినియోగమైంది. సింగపూర్ వాళ్లను కూడా ఇబ్బంది పెట్టారు. ఏపీ బ్రాండ్ దెబ్బతింది. ఏపీపై నమ్మకం పోయేలా గత పాలకులు వ్యవహరించారు. ఇక యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్నా.. అదే విధంగా అడ్డుకునే ప్రయత్నం చేశారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 మందికి ఉద్యోగాలు ఇస్తూ నియామక ఉత్తర్వులు ఇచ్చాం. మెగా డీఎస్సీని ఆపడానికి 150 పిటిషన్లను వేసి అడ్డంకులు సృష్టించారు. మొత్తం పారదర్శకంగా ఈ నియామకాలు జరిగాయి. ఇప్పటికి 14 సార్లు డీఎస్సీ నిర్వహించాం. ప్రతీ మూడు నెలలకు ఓసారి ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాల ద్వారా ఉద్యోగాలు కూడా యువత పొందుతున్నారు. ఇప్పటి వరకూ 1304 జాబ్ మేళాలు జరిగాయి. ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీల్లో చదువుకున్న వారికి 94 శాతం మందికి ప్లేస్మెంట్లు దక్కాయి. రాష్ట్రంలో 3.50 కోట్ల మందికి నైపుణ్యాలపై అధ్యయనం చేస్తున్నాం. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా జాబ్ మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు దీనిపై శ్రద్ధ పెట్టాలి. నాలెడ్జి ఎకానమీ ద్వారానే అభివృద్ధి సాధ్యం అవుతుంది." అని సీఎం వివరించారు.


**పెట్టుబడిదారుల్లో నమ్మకం పెంచాం :** "ఇప్పుడు మళ్లీ ఏపీపై విశ్వాసాన్ని పెంపొందించే ప్రయత్నం చేస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తోపాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నాం. పెట్టుబడులు పెట్టాక అది రాష్ట్ర ప్రాజెక్టుగా భావించి త్వరితగతిన అనుమతులు ఇచ్చి వేగంగా ఉత్పత్తి ప్రారంభించేలా చేస్తున్నాం. వికసిత్ భారత్ లో భాగంగా స్వర్ణాంధ్ర లక్ష్యంగా విజన్ రూపొందించాం. 2.4 ట్రిలియన్ ఎకానమీ, 450 బిలియన్ ఎగుమతులు, తలసరి ఆదాయం లాంటి లక్ష్యాలను పెట్టుకున్నాం. అలాగే వందశాతం అక్షరాస్యత, 95 శాతం నైపుణ్యం కలిగిన మానవ వనరులను సాధించటం లాంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. వివిధ రంగాల్లో పెట్టుబడులకు అనుగుణంగా పాలసీలు తీసుకువచ్చాం. అమరావతిని గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తున్నాం. పరిశ్రమలు వస్తే నీరు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. అందుకే నీటిభద్రత విషయంపైనా దృష్టి పెట్టాం. ఈ లక్ష్యాల సాధనకు ఏం చేయాలన్న దానిపైనా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. ప్రొడక్టు పర్ఫెక్షన్ నుంచి సర్క్యులర్ ఎకానమీ వరకూ వివిధ రంగాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం." అని చంద్రబాబు అన్నారు.

**ఇకపై విశాఖ నాలెడ్జీ సిటీ :** "విశాఖలో రూ. 1కి భూమి ఇస్తామంటే కొందరు వ్యతిరేకించారు. ఏడాదిలోనే టాప్ రేటెడ్ కంపెనీలు వస్తున్నాయి. 6 బిలియన్ డాలర్ల వ్యయంతో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోంది. టీసీఎస్, యాక్సెంచర్, కాగ్నిజెంట్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు వస్తున్నాయి. పోర్టు సిటీ, స్టీల్ సిటీ నుంచి నాలెడ్జ్ ఎకానమీ సిటీగా విశాఖ రూపు రేఖలు మారబోతున్నాయి. ఎకనామిక్ కారిడార్లు, పారిశ్రామిక క్లస్టర్లలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయి. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ కారిడార్లలో ఆయా రంగాలకు చెందిన పెట్టుబడులు రాబోతున్నాయి. టూరిజానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సాహకాలు ఇస్తున్నాం. ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే అదనపు ప్రోత్సాహకాలు ఇచ్చేలా విధానం రూపొందించాం. కారావాన్, హోంస్టేల ద్వారా పర్యాటకులను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. రాష్ట్రంలో 50 వేల హోటల్ రూముల నిర్మాణం చేపట్టేలా చర్యలు చేపట్టాం. దసరా అంటే కలకత్తా, మైసూరు లాంటి పట్టణాలు మాత్రమే గుర్తుకు వచ్చేవి. ఇప్పుడు ఆ నగరాల సరసన విజయవాడను చేర్చేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. రివర్ టూరిజం, ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, డెస్టినేషన్ వెడ్డింగ్ లను ఏర్పాటు చేయబోతున్నాం. ఎకో టూరిజంతో పాటు బీచ్ టూరిజం, టెంట్ సిటీల కోసం ప్రత్యేక ప్రాజెక్టులు చేపట్టాం. రాష్ట్రంలో 100 ఎక్స్ పీరియన్స్ సెంటర్లను అభివృద్ధి చేస్తున్నాం. 21 ప్రసిద్ద ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. శ్రీశైలం దేవస్థానానికి త్వరలోనే ప్రధాని మోదీ రాబోతున్నారు. గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఏపీని అభివృద్ధి చేస్తున్నాం. 2029-30 నాటికి 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పని చేస్తున్నాం.

ఈ రంగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఓ మంత్రుల కమిటీని నియమించాం. స్ట్రాటజిక్ క్లస్టర్ల ద్వారా వివిధ రంగాల పరిశ్రమల్ని ఆకట్టుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం." అని ముఖ్యమంత్రి చెప్పారు.

**కుటుంబానికో పారిశ్రామికవేత్త :** "క్వాంటం వ్యాలీ అమరావతి 2026 జనవరి నాటికి సిద్ధం అవుతుంది. వచ్చే రెండేళ్లలో క్వాంటం కంప్యూటర్లను ఎగుమతి చేసే స్థితికి ఏపీ వస్తుంది. రాష్ట్రంలో 3 సెంట్రల్ యూనివర్సిటీలు, 20 అటానమస్, 255 ఇంజనీరింగ్ కాలేజీలు రాష్ట్రంలో ఉన్నాయి. ఏపీని ఓ నాలెడ్జి హబ్ గా... ఫ్యూచర్ ఎకానమీకి ఓ కేంద్రంగా తయారు చేసుకుంటున్నాం. గవర్నెన్సు 4.0 స్టేట్ డేటా లేక్ తో ప్రభుత్వ విభాగాలను అనుసంధానించి పౌరసేవలను సులభంగా అందేలా చేస్తున్నాం. 734 సర్వీసులు వాట్సప్ ద్వారా అందిస్తున్నాం. వీటితో పాటు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా కొత్త ఆవిష్కరణలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తాం. వన్ ఫ్యామిలి, వన్ ఎంట్రప్రెన్యూర్ లక్ష్యంగా పనిచేస్తున్నాం. వీటన్నిటితో హెల్తీ , వెల్తీ , హ్యాపీ ఆంధ్రప్రదేశ్ ను సాధిస్తాం. ఏడాదిలో మూడో అతి పెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా భారత్ మారుతోంది. సంస్కరణల్ని, అవకాశాల్ని వినియోగించుకుని... సంపద సృష్టించాం. మంచి పబ్లిక్ పాలసీ వస్తే కోట్లాది మంది జీవితాలు మారతాయి. యువ ఎమ్మెల్యేలు చాలా అంశాలను అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా పాలసీలు రూపొందించడంలో భాగస్వామ్యం కావాలి." అని సీఎం చంద్రబాబు సూచించారు.

# ధనలక్ష్మీ అలంకాలంలో అమ్మదర్శనం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు పట్టణంలోని వివిధ కూడళ్ళలో గల అమ్మవారి ఆలయాలలో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో 5వ రోజు అయిన శుక్రవారం అమ్మవారు ధనలక్ష్మి దేవి అలంకారంలో భక్తులచే పూజలందుకున్నారు

94వ దేవి శరన్నవరాత్రు ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్న క్రమంలో శుక్రవారం దేవి చౌక్ లోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో భక్తులచే పూజలు అందుకున్నారు. విశేష శ్రీ చక్ర అర్చన పూజలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. అష్టలక్ష్మి ఆలయంలో అమ్మవారికి విశేషంగా కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పూజావిధులు నిర్వహించారు. కాళీమాత ఆలయం సెంటర్లో దసరా మహొూత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి శుక్రవారం కాళీమాతకు ధనలక్ష్మి అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారికి అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిరోజు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రాధాన్యతను చాటుకుంటున్నాయి. శ్రీ లాస్య కూచిపూడి నాట్యాలయం, నృత్య గురువులు జంధ్యాల వెంకట శ్రీరామచంద్రమూర్తి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యప్రదర్శనలు అహుతులను అలరించాయి. అనంతరం అతిధుల చేతుల మీదుగా నర్తకి మణులకు బహుమతులను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో దసరా మహొూత్సవాలు విశేషంగా కొనసాగుతున్నాయి. బోస్ రోడ్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవి మాత, ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విశేషంగా కరెన్సీ నోట్లతో ఆలయ అర్చక స్వామి కోటేశ్వర శర్మ అలంకారములు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఆర్యవైశ్య ప్రముఖులు ధనలక్ష్మి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని తమ అభీష్టాలు నెరవేరాలని మొక్కుకున్నారు. నిత్యము సాయంత్రం వేళలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మారిస్ పేటలో వేంచేసియున్న శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత, చంద్రమౌళేశ్వర స్వామి వారి ఆలయంలో, అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో పూజలు అందుకున్నారు. ఆలయ పాలకమండలి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి ధనలక్ష్మి అలంకారాన్ని విశేషంగా నిర్వహించారు. అదేవిధంగా బాలాజీరావు పేట శివారు అయ్యప్పపురంలో వేంచేసియున్న ప్రధాన అయ్యప్ప స్వామి దేవాలయంలో అష్టభుజ దుర్గాదేవి అమ్మవారు,ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మహిళా భక్తులు లలితా సహస్రనామ సహిత కుంకుమార్చన పూజలలో పాల్గొన్నారు. వ్యవస్థాపక అర్చక స్వామి దుర్భ హరిబాబు శాస్త్రి పర్యవేక్షణలొ అష్టభుజ దుర్గాదేవి అమ్మవారికి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

# ఎస్సీ అధికారులకు పదోన్నతులకు కల్పించాలి



**ఇబ్రహీంపట్నం (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ జెన్కోలో అర్హత గల ఎస్సీ ఉద్యోగులకు జీవో నెంబర్ 19 ప్రకారం పదోన్నతులు కల్పించాలని ఎస్సీ,ఎస్టి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు కోరారు. ఈ మేరకు ఏపీ జెన్కో ఎండిగా బాధ్యతలు చేపట్టిన ఎస్.నాగలక్ష్మి ని సురేష్ బాబు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పదోన్నతుల అంశంపై చర్చించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ ఏపీ జెన్కోలో ఎస్ఈ పోస్టుల్లో ఎస్సీ కేటగిరికి చెందిన ఖాళీలు ఉన్నప్పటికీ నాలుగు నెలలుగా పదోన్నతులు కల్పించకుండా జాప్యం చేస్తున్నట్లు పేర్కొన్నారు. జీవో నెంబర్ 19 ప్రకారం రోస్టర్ పాయింట్లలో ఎస్సీ ఉద్యోగులకు పదోన్నతుల ద్వారా ఇవ్వాల్సిన ఎస్ఈ పోస్టులను వేరే కేటగిరీకి ఇచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. ఏపీ జెన్కోలో అర్హత గల ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎండి నాగలక్ష్మి ని కోరారు. సురేష్ బాబు వినతులకు సానుకూలంగా స్పందించిన ఎండి నాగలక్ష్మీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చారు.

# అమరావతిలో ఇండియా ఇంటర్నేషనల్ లీగల్ యూనివర్సిటీ

(మొదటి పేజీ తరువాయి)

సవరణ బిల్లులను మంత్రి నారా లోకేష్ సభలో ప్రవేశపెట్టగా, ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఇందులో అడ్మిషన్లను కూడా 2025-26 లో ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో 20శాతం రాష్ట్రంలోనే స్థానికులకే ఇవ్వాలని బిల్లులో పొందుపర్చాం. కేవలం లీగల్ ఎడ్యుకేషన్ మాత్రమే కాకుండా పిజి, పిహెచ్ డి వంటి పరిశోధనలకు కేంద్రంగా ఈ విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దాలన్నది తమ లక్ష్యమని మంత్రి లోకేష్ తెలిపారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 1986లో నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ బెంగుళూరులో ఏర్పాటుచేశారు. అది భారతదేశానికి మోడల్ లా యూనివర్సిటీగా తయారైంది. 1993లో చీఫ్ జస్టిస్ కాన్ఫరెన్స్ లో అన్ని రాష్ట్రాల్లో లా యూనివర్సిటీలు ఏర్పాటుచేయాలని తీర్మానించారు. న్యాయ పరిశోధనకు మనదేశంలో మోడల్ లీగల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ ఏర్పాటుచేయాలన్న లక్ష్యంతో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ను ఏర్పాటుచేశారు. ఈ ట్రస్ట్ ఆధ్వర్యాన ఇప్పటికే గోవాలో IIULER ఏర్పాటుచేసింది. ఈ బోర్డులో సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిలు సభ్యులుగా ఉంటారని మంత్రి తెలిపారు. ఈ యూనివర్సిటీకి అమరావతిలో 55ఎకరాలను చదరపు మీటర్ రూపాయి లీజు చొప్పున కేటాయించాం. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ యూనివర్సిటీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేస్తారు. ఇందులో రాష్ట్ర కోటా 20శాతం ఉంటుంది. అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రానికి వచ్చినపుడు పెద్దఎత్తున ప్రోత్సహించాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వంపై ఉంది. అందుకు అద్భుతమైన ఉదాహరణ ఇండియన్ స్కూల్ ఆఫ్



బిజినెస్. మహారాష్ట్ర, తమిళనాడుకు వెళ్లాల్సిన ఐఎస్ బిని చంద్రబాబునాయుడు పోటీపడి ఆనాడు హైదరాబాద్ కు తీసుకెళ్లారు. దానివల్ల హైదరాబాద్ లో ఆ ప్రాంత రూపురేఖలు మారాయి. అక్కడ విద్యనభ్యసించిన అన్ని సామాజిక వర్గాల వారు ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్నతస్థానాల్లో ఉన్నారు. రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఎపిలో ప్రతిష్టాత్మక సంస్థలను రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి లోకేష్ చెప్పారు.

**గ్లోబల్ యూనివర్సిటీల రప్పించడానికే సవరణబిల్లు :** ఎపి ప్రైవేట్ విశ్వవిద్యాలయాల స్థాపన, సవరణ బిల్లులను మంత్రి నారా లోకేష్ సభలో ప్రవేశపెడుతూ... విశ్వవిద్యాలయాల్లో హైక్వాలిటీ ఎడ్యుకేషన్, రీసెర్చి ఓరియంటెడ్, ఇండస్ట్రీ రిలవెంట్ హయ్యర్ ఎడ్యుకేషన్ లక్ష్యంగా 11-1-2016లో ఆనాటి ప్రభుత్వం ప్రైవేటు యూనవర్సిటీ యాక్ట్ ను తీసుకువచ్చింది. ఇందులో భాగంగా గ్రీన్ ఫీల్డ్, బ్రౌన్ ఫీల్డ్ విశ్వవిద్యాలయాలను ఏర్పాటుకు అనుమతించాలని నిర్ణయించారు. దీనిద్వారా రాష్ట్రంలో 14ప్రైవేటు యూనివర్సిటీలు వచ్చాయి. యాక్ట్ 40, 2023ని గత వైసిపి ప్రభుత్వం అనాలోచితంగా టాప్ -100 గ్లోబల్ వర్సిటీలతో కంపల్సరీ జాయింట్ సర్టిఫికేషన్ డిగ్రీ ఉంటేనే అనుమతించాలని నిబంధన విధించింది. యుజిసి 2022లో న్యాక్ 3.0 లో కనీసం 3 గ్యాడ్యుయేట్ బ్యాచ్ లు, ఎన్ ఐఆర్ఎఫ్ టాప్ -100 ఉంటేనే జాయింట్ డిగ్రీలు ఇవ్వగలుగుతారని యుజిసి చెప్పింది. న్యాక్ అర్హత సాధించడానికి గ్రీన్ ఫీల్డ్ యూనివర్సిటీలకు కనీసం ఆరు సంవత్సరాలు పడుతుంది. గత ప్రభుత్వం విధించిన నిబంధన వల్ల ఎపికి ప్రైవేటు యూనివర్సిటీలు రాలేదు, పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయాయి. ఇతర రాష్ట్రాలతో పోటీపడి ప్రపంచంలో ఉన్న విశ్వవిద్యాలయాలను ఎపికి రప్పించాలన్న ఉద్దేశంతో జాయింట్ సర్టిఫికేషన్ నిబంధనను తొలగించాలని నిర్ణయం తీసుకున్నాం. గ్లోబల్ స్టాండర్డ్స్ కు అనుగుణంగా ఎపిలో పెద్దఎత్తున ప్రైవేటు యూనివర్సిటీలను ప్రోత్సహించాల్నదే మా లక్ష్యం. దీనివల్ల మెరుగైన పరిశోధనలు జరగడమేకగాక స్టార్టప్ ఎకోసిస్టమ్ అభివృద్ధి చెందుతుంది. మన ప్రాంతంలో వచ్చే పరిశ్రమలకు అనుగుణంగా ప్రత్యేకమైన కరిక్యులమ్ తేవడానికి దీనిద్వారా అవకాశమేర్పడుతుంది. గ్లోబల్ బెంచ్ మార్క్ కు అనుగుణంగా ఎన్ రోల్ మెంట్ రేషియో పెంచడానికి ఆస్కారమేర్పడుతుంది, ప్రైవేటు వర్సిటీల వల్ల మెరుగైన అవకాశాలు లభిస్తాయి, సింగపూర్ లో స్పోర్ట్స్ యూనివర్సిటీని పరిశీలించాం, ఇప్పుడు సబ్జెక్ట్ స్పెసిఫిక్ యూనివర్సిటీలు కూడా వస్తున్నాయని మంత్రి లోకేష్ చెప్పారు.

**మెగా డిఎస్సీ నిర్వహణ గర్వకారణం :** అదోని నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర చేస్తున్నప్పుడు అక్కడ ప్రజలు పనులకోసం వలసవెళ్లడం చూశాను. ఒకేరోజు వలసవెళ్లి 140వాహనాలు గమనించారు. ఆలూరు, మంత్రాలయం, ఆదోనిలో నీళ్లకోసం బిందెలు మోసుకెళ్లడం చూశాను. ప్రతి ఇంటికి కుళాయి ఇవ్వాలన్నది అక్కడినుంచి వచ్చిన ఆలోచనే. అక్షరాస్యత, ఎన్ రోల్ మెంట్, విద్యకు సంబంధించిన అంశాల్లో కర్నూలు జిల్లా వెనుకబడి ఉంది. ప్రభుత్వ విద్యను అక్కడ బలోపేతం చేయాలని, రిక్రూట్ మెంట్ చేయాలని అధికారులకు చెప్పాను. కర్నూలు జిల్లాపై ఎక్కువ శ్రద్ధ పెట్టాం. డిఎస్సీలో ఎక్కువ పోస్టులను కర్నూలు జిల్లాకే ఇచ్చాం. యువగళంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ప్రజాప్రభుత్వం పనిచేస్తోంది. ఇచ్చిన ప్రతిహామీ నిలబెట్టుకుంటామని మంత్రి లోకేష్ చెప్పారు. ఎలాంటి ఆరోపణలకు తావీయకుండా స్పోర్ట్స్ కోటాతో సహా అన్ని రిజ్వర్వేషన్లు డిఎస్సీలో అమలుచేశాం. విద్యాప్రమాణాల మెరుగుదలకు కమిట్ మెంట్ తో పనిచేస్తాం, ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు ప్రతిఏటా డిఎస్సీ నిర్వహిస్తాం. మెగా డిఎస్సీ నిర్వహణ కూటమి ప్రభుత్వానికి గర్వకారణమని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. నవంబర్ 26న భారత రాజ్యాంగ దినోత్సవం రోజున బాలల అసెంబ్లీ నిర్వహణకు మంత్రి లోకేష్ ప్రతిపాదించగా, శాసనసభ ఆమోదం తెలిపింది. మంత్రి లోకేష్ మాట్లాడుతూ...గత సమావేశాల్లో బాలల అసెంబ్లీ నిర్వహణని ప్రతిపాదించా. చట్టసభల నిర్వహణపై పిల్లలకు అవగాహన ఏర్పడుతుంది. అప్పుడే సమాజంలో మనం ఆశిస్తున్న మార్పు వస్తుంది. కేవలం హక్కులేకాదు, బాధ్యతలు కూడా ఉంటాయని బాలలకు తెలుస్తాయని అన్నారు.

## అధికార యంత్రాంగానికి అభినందన



**నిమ్మాడ (జర్నలిస్ట్ ఫైల్) :** కోటబొమ్మాళి మండలం, టెక్కలి నియోజకవర్గం : కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాలు విజయ వంతం చేసిన ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా రేయింబవళ్లు శ్రమించిన యంత్రాంగానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించి పదిరోజులుగా ఏర్పాట్లలో తలమునకలయిన అధికార, అనధికార వర్గాల కృషి అలానే పారిశుధ్య సిబ్బంది అంకిత భావం మరువలేనిదని అన్నారు. సచివాలయంలో ఉంటూ తాను నిర్దేశం ఇచ్చిన ప్రతి మాటనూ పాటించి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అమ్మవారి భక్తులకు ఏ ఆటంకం రాకుండా దివ్య దర్శనం అయ్యేందుకు ఎక్కడా అసౌకర్యానికి తావులేకుండా కృషి చేసిన పోలీసు సిబ్బంది సేవలు స్మరణీయం అని కొనియాడారు. అలానే ఆర్టీసీ సిబ్బంది సేవలు, ఉత్సవాలలో వలంటీర్ల సేవలు ఎంతో బాగున్నాయని, వందేళ్ల ఉత్సవానికి వన్నె తెచ్చే విధంగా కళా బృందాలు ఎంతగానో కృషి చేశాయని, శోభాయాత్రతో ఉత్తరాంధ్రుల సంస్కృతిని చాటి చెప్పారని అన్నారు. ఉత్సవాలను మరిచిపోలేని విధంగా తీర్చిదిద్దిన ప్రతి ఒక్కరికీ తన తరఫున అభినందనలు తెలిపారు. జిల్లా స్థాయి అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఉత్సవాలకు వన్నె తెచ్చారని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో జిల్లా అభివృద్ధి అంతా కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. కోటబొమ్మాళి అమ్మవారి దీవెనలు జిల్లా ప్రజలపై ఉండాలని మరొక్కసారి ఆకాంక్షించారు.

## ఐలమ్మ జీవితం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా తొలి భూస్వామ్య పోరాటానికి నాంది పలికిన వీరనారి చిట్యాల ఐలమ్మ గారి 130వ జయంతి సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం గుంటూరు చంద్రమౌళి నగర్ మెయిన్ రోడ్డులోని ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం భారీ కేకును ఎమ్మెల్యే గళ్ళా మాధవి కట్ చేసారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ పేరు అంటేనే ధైర్యానికి, పోరాటానికి ప్రతీక. ఆనాటి అణచివేత శక్తులకు ఒంటరిగా ఎదురొడ్డి, సాయుధ పోరాటం చేసి విజయం సాధించిన మహిళ. భూస్వామ్య అహంకారాన్ని ఛేదించి, సామాన్య ప్రజల హక్కుల కోసం తన ప్రాణాల్ని పణంగా పెట్టిన ఆమె నిజమైన స్వాతంత్ర సమరయోధురాలు. ఐలమ్మ త్యాగం, ధైర్యం, పోరాటం ఇవాళ ప్రతి తరానికి స్ఫూర్తిదాయకం" అని పేర్కొన్నారు. "రజక జాతికి గర్వకారణమైన ఐలమ్మ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు. ఐలమ్మ చూపిన దారిలోనే మనం కూడా సమానత్వం, న్యాయం, గౌరవం కోసం కట్టుదిట్టంగా ముందుకు సాగాలి" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పరుచూరి సంజీవ్, అన్నవరపు మల్లి, నూతలపాటి సాంబశివరావు మరియు కొమ్మినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ మోర్చా ఆత్మీయ సమావేశం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ బాషా రాష్ట్ర పర్యటనలో భాగంగా గుంటూరు బీజేపీ కార్యాలయానికి విచ్చేసి మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సాంబశివరావు మరియు హేమంత్ సోలంకి సమన్వయించారు.

రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షులు సయ్యద్ బాషా మాట్లాడుతూ, ఈ సమావేశం ద్వారా జిల్లాలో మైనార్టీ మోర్చా బలోపేతానికి కృషి జరుగుతుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ మైనార్టీ వర్గాల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టినట్లు గుర్తు చేశారు. ఆ పథకాలు బడుగు బలహీన వర్గాలకు అందేలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అలాగే కూటమి ప్రభుత్వం కారణంగా ఈ పథకాల ప్రయోజనాలు ప్రజలంతా పొందేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు.

జిల్లా అధ్యక్షుడు చెరుకు తిరుపతిరావు వెల్లడించారు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీన్ మాధవ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత పార్టీ కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయని, వారి నేతృత్వంలో మండలస్థాయిలో మైనార్టీ మోర్చా బలోపేతం కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ కుద్దూస్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ షేక్ రఫీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌస్ పీరా, మైనార్టీ నాయకులు షేక్ మహబూబ్, డి. హుస్సేన్, షేక్ మౌలాలి, షేక్ ఫరహానా, షేక్ బిలాల్, పార్లమెంట్ సంయోజకులు భీమినేని చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, చరక కుమార్ గౌడ్, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, కొర్ర శ్రీనివాస్ నాయక్, మండల అధ్యక్షులు తంగా లక్ష్మణరావు, నాయకులు తాడువాయి రామకృష్ణ, చింతల అనిల్, రాజేష్ నాయుడు, టీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

## రాచరిక పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఐలమ్మ

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** వీరనారి చిట్యాల ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా గుంటూరు చంద్రమౌళి నగర్ లోని మాజేటి కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ , బీసీ వెల్ఫేర్ మంత్రి ఎస్. సవిత , గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తో కలిసి ఐలమ్మ కి ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాచరిక పాలకులు అనుసరించే ప్రజావ్యతిరేక విధానాలపై క్షేత్రస్థాయిలో పోరాడిన వ్యక్తి చిట్యాల ఐలమ్మ అని అన్నారు. భూస్వామి పెత్తందారి వ్యవస్థల మీద ఐలమ్మ చేసిన పోరాటం మహిళా చైతన్యానికి బహుజన వర్గాల ఆత్మగౌరవానికి నిదర్శనమని అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తిని అందరూ స్మరించుకోవాలని స్మరించుకున్న మన్నవ పిలుపునిచ్చారు.

# భాగస్వామ్య సదస్సు విజయవం చేయండి



**ఉండవల్లి(జర్నలిస్ట్ ఫైల్):** విశాఖపట్నంలో నవంబర్ 14, 15 తేదీల్లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సీఐఐ 30వ భాగస్వామ్య సదస్సు విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు జరగకుండా పటిష్ట ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్ల పర్యవేక్షణకు సంబంధించిన వివిధ కమిటీల ఉన్నతాధికారులతో ఉండవల్లి నివాసంలో మంత్రివర్గ ఉపసంఘం విస్తృత సమీక్ష నిర్వహించింది. మంత్రి నారా లోకేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమీక్షలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఛైర్మన్ హోదాలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెట్టుబడుల అనుకూల వాతావరణం, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను వివరించడంతో పాటు వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. క్లస్టర్ విధానంలో పెట్టుబడులను ఆకర్షించాల్సిన అవసరం ఉంది. ఒక్క జూమ్ కాల్ ద్వారా ఆర్సెల్లర్ మిట్టల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ ఏపీకి వచ్చింది. రాష్ట్రంలో ఇప్పటివరకు సాధించిన పెట్టుబడులు, తీసుకువచ్చిన ప్రతిష్టాత్మక సంస్థల గురించి వివరించాలన్నారు. కార్యక్రమం అజెండాతో పాటు వేదిక రూపకల్పన, నమూనాపై సమీక్షలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రివర్గ ఉపసంఘం పలు సూచనలు చేసింది. అక్టోబర్ నెలలో వివిధ దేశాల్లో చేపట్టనున్న రోడ్ షోల గురించి అధికారులు వివరించారు. ఆహ్వానాలు, ప్రోటోకాల్, వసతి, రవాణ, భద్రత, నగర సుందరీకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, మీడియా, ప్రచారానికి సంబంధించిన ఏర్పాట్లను ఆయా కమిటీల ఉన్నతాధికారులు వివరించారు. ఈ సందర్భంగా భాగస్వామ్య సదస్సు-2025 అధికార వెబ్ సైట్ ను మంత్రి నారా లోకేష్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, టీజీ భరత్, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్ తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని దుర్గమ్మను కోరాను



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** దసరా ఉత్సవాలలో భాగంగా ఇంద్రకీలాద్రిపై మహాలక్ష్మి అవతారంలో వెలసిన దుర్గమ్మను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు మంత్రి అచ్చెన్నాయుడు ని ఆశీర్వదించారు. ఆలయ ఈవో శీనా నాయక్ అమ్మవారి ఫొటో ను మంత్రికి అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ దసరా మహోత్సవాలు ప్రజలందరికీ శక్తి, శాంతి, ఐశ్వర్యం ప్రసాదించే పవిత్ర వేళ. మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మ ఆశీస్సులతో ప్రతి కుటుంబం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని ప్రార్థిస్తున్నాను అని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ అభివృద్ధి ఫలాలు అందించాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు పగలు-రాత్రి శ్రమిస్తున్నారు. ఆయన దూరదృష్టి, సుసంపన్నమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి పునాది వేస్తోంది. విద్య, వైద్య, వ్యవసాయ, పరిశ్రమ రంగాలలోనే కాకుండా ప్రతి పేద కుటుంబానికి వెలుగులు నింపే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు అని అన్నారు.

అలాగే, ప్రజలు సుఖశాంతులతో జీవించాలనే ఆకాంక్షతో సీఎం చంద్రబాబు తీసుకుంటున్న ప్రతి నిర్ణయం ఒక పథకం కాదు, అది ప్రజాసేవకు ప్రతిరూపం. ఇలాంటి నాయకత్వం ఉండటం రాష్ట్రానికి దైవకృపతో సమానం అని పేర్కొన్నారు. దసరా శక్తి పండుగ. దుర్మార్గం పై సత్యం గెలిచిన శుభసందేశాన్ని అందరికీ గుర్తు చేసే ఈ పర్వదినంలో, మనమంతా ఐక్యంగా ఉండి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడుదాం అని పిలుపునిచ్చారు.

**సౌకర్యాలపై ఆరా :** నవరాత్రుల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూ లైన్స్, మంచి నీరు సదుపాయాలు, ప్రసాదాలు అందుచేత, మరిన్ని సదుపాయాలను మంత్రి పరిశీలించారు. భక్తులను ఆప్యాయంగా పలకరిస్తూ ఏ ప్రాంతం నుండి వచ్చారో అడిగి తెలుసుకుని, సౌకర్యాలు ఎలా ఉన్నాయంటూ అందరిని అడిగారు. ఇబ్బంది లేకుండా వసతులు ఉన్నాయంటూ ప్రజలు సమాధానం చెప్పారు. ఆనందంగా అమ్మవారిని దర్శించుకుని, దూరప్రాంతాల వారు జాగర్తగా నివాసాలకు చేరుకోవాలని సూచించారు.

# మసీదుల అభివృద్ధికి నిధులిప్పించండి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో మసీదులు నిర్మాణానికి, మరమ్మతులకు, కబరస్తాన్ల అభివృద్ధి వక్ఫ్ బోర్డు ద్వారా రివాల్వింగ్ ఫండ్ ఇప్పించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ కోరారు. శుక్రవారం అసెంబ్లీ వేదికగా ముస్లిం మైనారిటీల కోసం తన గళం వినిపించారు. తొలుత గోవాలో ఉద్రిక్తతల సమయంలో అక్కడ చిక్కుకున్న ఏపీ వాసులను విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకుని స్వగ్రామాలకు చేర్చేందుకు చేసిన కృషికి ధన్యవాదాలు తెలిపారు. మంత్రి లోకేశ్ నిబద్ధత, అంకితభావం దేశంలోని నాయకులందరికీ ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. అనంతరం రాష్ట్రంలో మసీదులు, కబరస్తాన్ల నిర్మాణాల విషయాన్ని సభ దృషికి తీసుకొచ్చారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డులు విడిపోయాయని, ఆ సమయంలో ఏపీకి రూ. 63 కోట్లు రావాల్సి ఉందని చెప్పారు. ఈ నిధులను వెంటనే విడుదల చేయించాలని కోరారు. మసీదులు, కబరస్తాన్ల కోసం 2014-19 వరకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రూ. 10 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం కేవలం రూ. 40 లక్షలు మాత్రం వెచ్చించిందని, దీంతో మసీదులు, కబరస్తాన్ల అభివృద్ధి అత్యవసరమైందని వివరించారు. వక్ఫ్ బోర్డు రివాల్వింగ్ ఫండ్ కేటాయించడం ద్వారా మసీదులు, కబరస్తాన్లను అభివృద్ధి చేసుకోవడానికి వీలు కలుగుతుందని తెలిపారు. ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ ఫరూక్ ను కోరారు.

**స్పీకర్ కు ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక ధన్యవాదాలు :** అసెంబ్లీలో స్పీకర్ అయ్యన్నపాత్రుడును గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, నసీర్ ప్రత్యేకంగా కలిసి ఘనంగా సత్కరించారు. అసెంబ్లీ లెజిస్లేటివ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ గా అవకాశం కల్పించినందుకుగా ధన్యవాదాలు తెలిపారు. పదవిని బాధ్యతగా తీసుకుని మైనారిటీల సంక్షేమానికి, అభ్యున్నతికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# కృష్ణా నది వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** కృష్ణా నది వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా కోరారు. కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం, అన్నవరంపాలెం లంక గ్రామాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. లంక గ్రామాల ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. కృష్ణా నది వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నదిని దాటుటకు ప్రయత్నించాదని విజ్ఞప్తి చేశారు. దాదాపు 4 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుందని తెలిపారు. నదిలో ఈతకు వెళ్ళడం, దుస్తులు ఉతకడానికి వెళ్ళడం వంటి పనులు చేయరాదని సూచించారు. అధికారులు, సిబ్బంది ఇచ్చే సూచనలు పాటించాలని అన్నారు. పంటల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వర్షాలు, వరదల వలన నీటి నిలువ ఉండకుండా చూడాలని, పారిశుధ్యం పాటించాలని పేర్కొన్నారు. వ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అవసరం మేరకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజన సిన్హా, ఇన్ ఛార్జ్ తహసిల్దార్ గోపాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# అతిసార వ్యాధిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్)** జిల్లాలో అతిసార వ్యాధి నియంత్రణలో ఉందని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం జిల్లా కలెక్టర్ లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 177 కేసులు నమోదు అ-య్యాయన్నారు. గుంటూరు పట్టణం నుండి 152 కేసులు రాగా, గ్రామీణ ప్రాంతం నుండి 25 కేసులు నమోదు అయ్యాయని చెప్పారు. వివిధ ప్రాంతాల నుండి కేసులు నమోదు అయ్యాయని, ఆయా ప్రాంతాలకు ప్రత్యేక అధికారులను నియమించి నిశితంగా పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 91 కేసులు చికిత్స పొందుతున్నారని తెలిపారు. నియంత్రణ చర్యలు పూర్తి స్థాయిలో చేపట్టామని 120 ప్రైవేట్ ఆర్.ఓ ప్లాంట్లను గుంటూరు పట్టణంలో తనిఖీ చేయగా 21 ప్లాంట్లలో హానికారక బ్యాక్టీరియాను గుర్తించడం జరిగిందని, వాటిని తక్షణం సీజ్ చేశామని వివరించారు. గ్రామీణ ప్రాంతంలో 140 ప్రైవేట్ ఆర్.ఓ ప్లాంట్లను తనిఖీ చేయగా 16 నీరు కలుషితం జరిగినట్లు గుర్తించడం జరిగిందని చెప్పారు. అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, దాదాపు 8 వేల గృహాలలో సర్వే చేశామని అన్నారు. నీటి సరఫరాను నిలుపుదల చేసి ప్రత్యేకంగా సరఫరా చేస్తున్నామని తెలిపారు. వ్యాధుల విస్తృతికి ప్రమాదకరంగా ఉండవచ్చు అనే బయట ఆహార విక్రయాలు నివారించామని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ అతిసార వంటి వ్యాధులు ప్రబలిన తక్షణం ఆయా ప్రాంతాల్లో తాగునీరు నిలుపుదల చేయడం, పారిశుధ్యం పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. 24 గంటల్లో అరికట్టుకు చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్ లు సంబంధిత మున్సిపల్ కమిషనర్ లను పర్యవేక్షణ చేయాలని అన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, నగర పాలక కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జిల్లా విద్యా శాఖ అధికారి రేణుక తదితరులు పాల్గొన్నారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. 24 గంటల్లో ఇది వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్న నేపథ్యంలో హోం మంత్రి అనిత కలెక్టర్లతో అత్యవసర సమీక్ష నిర్వహించారు.

హోం మంత్రి మాట్లాడుతూ, ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు జిల్లాల వారీగా అధికారులందరూ క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి, ప్రజలకు వెంటనే సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదకర ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు.

అల్పపీడనం ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తుండగా, కోస్తాంధ్ర, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. సహాయక చర్యల కోసం ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, పోలీసు, ఫైర్ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని హోం మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

ఈ పరిస్థితుల్లో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేయబడ్డాయి. పొంగిపొర్లే కాలువలు, నీటిమునిగిసిన రహదారులు దాటవద్దని ప్రజలకు సూచించారు. అలాగే ఈదురుగాలులు వీచే సమయంలో చెట్ల క్రింద, శిధిలావస్థలో ఉన్న భవనాల దగ్గర నిలువరాదని హెచ్చరించారు.

## అమ్మో భౌబోయ్



**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్):** మండల పరిధిలోని గ్రామాలలో వీధి శునకాల తాకిడి పెరిగిపోయింది. గ్రామాలలోని వీధులలో స్వైరవిహారం చేస్తున్నాయి. పలు చోట్ల

ఒంటరిగా వెళ్ళే వారు, ద్వి చక్ర వాహనాలు పై వెళ్ళే వారిపై కుక్కలు వెంబడిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. శుక్రవారం నాడు కాకుమాను మండల పరిధిలోని అప్పాపురం గ్రామంలో సైకిల్ పై వెళ్తున్న 6 ఏండ్ల చిన్నారి పై ఒక్కసారిగా వీధి కుక్కలు దాడి చేయగా స్థానిక ప్రజలు గమనించడం తో పెద్ద ప్రమాదం తప్పిందని తెలిపారు. వెంటనే బాలుడిని స్థానిక కాకుమాను ప్రభుత్వ వైద్య శాల నందు చికిత్స అందించినట్లు తెలిపారు. గ్రామాలలో వీధి కుక్కలు అధిక సంఖ్యలో ఉన్నాయని అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**గతంలో సంచలనం రేపిన ఘటనలు :** గతంలో కాకుమాను లో వీధి కుక్కలు ముక్కుపచ్చలారని ఒక చిన్నారి పై చేసిన దాడిలో చిన్నారి మృతి చెందిన సంఘటన తో అప్పట్లో సంచలనం కలిగించింది. పలు చోట్ల అరకొర సంఘటనలు అప్పుడప్పుడు జరుగుతూనే ఉన్నాయి. అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగక ముందే గ్రామాలలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**కుక్క గాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు :** ప్రమాదవశాత్తు కుక్క గాటుకు గురైన సందర్భంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి కాకుమాను ప్రాథమిక వైద్యాధికారి డా. స్వర్ణ. రాజశేఖర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ కుక్క గాటుకు గురైన వెంటనే వీలైనంత త్వరగా ఆ గాయం పైనుండి కిందుగా నీరు ధారగా కిందకు పడే విధంగా మగ్గు తో లేదా పంపు ద్వారా నీటిని పోస్తూ శుభ్రంగా కడగాలి. గాయనికి ఏటువంటి కట్టు కట్టకూడదు. కుక్క గాటు తో రేబిస్ వచ్చే అవకాశాలు ఎక్కువ గా ఉంటాయి కాబట్టి త్వరితగతిన స్థానిక వైద్యులను సంప్రదించాలని సూచించారు. వైద్యులు గాయం తీవ్రతను బట్టి చికిత్స అందిస్తారని సూచించారు.

## శ్రీ మహాలక్ష్మి దేవి గా దర్శనమిచ్చిన ఆదిశక్తి



**మచిలీపట్నం,(జర్నలిస్ట్ ఫైల్):** ధన, ధాన్య, ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య, సంతాన, గజలక్ష్ములుగా వరాలు ప్రకటించే అష్టలక్ష్ముల సమిష్టి రూపంగా శ్రీమహాలక్ష్మీ రూపాన్ని పేర్కొంటారు. మహాలక్ష్మీ సర్వమంగళకారిణి, ఐశ్వర్యప్రదాయిని. నవరాత్రులలో నాలుగవరోజు మహాలక్ష్మీ రూపంలో భక్తులను అనుగ్రహించారు. రెండు చేతులలో కమాలలను ధరించి, అభయవరద హస్త ముద్రలను ప్రదర్శిస్తూ, గజరాజు సేవిస్తుండ గా శ్రీ మహాలక్ష్మీ రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ వెల్లి విరుస్తోంది. జిల్లా కేంద్రమైన మచిలీపట్నం లో సైతం స్థానిక అమ్మవారి ఆలయాలు మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి.

**శుక్రవారం మహాలక్ష్మీగా :** వరాలిచ్చే తల్లి, సిరిసంపదలు కురిపించే మాత అయిన మహాలక్ష్మీ రూపంలోని అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు విశేష సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు... శుక్రవారం మహాలక్ష్మీగా అమ్మవారు అభయమివ్వడం ప్రత్యేకత. లోక స్థితికారిణిగానూ మహాలక్ష్మీ అమ్మవారికి పేరుంది. అష్టలక్ష్ముల సమష్టి రూపమే మహాలక్ష్మీ.

డోలాసురుడు అనే రాక్షసుడిని వధించింది. శక్తి త్రయంలో మధ్య శక్తి. మహాలక్ష్మీని ఉపాసిస్తే ఫలితాలు త్వరితంగా కలుగుతాయని భక్తుల నమ్మిక. యాదేవీ సర్వభూతేషు లక్ష్మీరూపేణ సంస్థితా అంటే అన్ని జీవులలోనూ ఉండే లక్ష్మీస్వరూపం దుర్గాదేవని చండీసప్తసతి చెబుతోంది. శరన్నవరాత్రులలో మహాలక్ష్మిని పూజిస్తే సర్వ మంగళ మాంగల్యాలు కలుగుతాయి. ఎరుపు రంగు వస్త్రాలతో అమ్మవారు దర్శనమిచ్చారు. శుక్రవారం అమ్మకు నైవేద్యంగా చెక్కర పొంగలి, క్షీరాన్నం సమర్పించారు. మహాలక్ష్మీగా అమ్మవారు అభయమివ్వడం శుక్రవారం నాటి ప్రత్యేకత. లోక స్థితికారిణిగానూ మహాలక్ష్మీ అమ్మవారికి పేరుంది. ధన, ధాన్య, ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య, సంతాన, గజలక్ష్ములుగా వరాలు ప్రకటించే అ-ష్టలక్ష్ముల సమిష్టి రూపంగా శ్రీమహాలక్ష్మీ రూపాన్ని పేర్కొంటారు.

**మహాలక్ష్మీ సర్వమంగళకారిణి, ఐశ్వర్యప్రదాయిని. :** మహాలక్ష్మీ దేవి అవతారం లో అమ్మవారిని అనేక ఆభరణాలతో,నగదు నోట్లతో అలంకరించారు. జ్ఞానం, సమతుల్యత మరియు పరిణతి చెందిన మనస్సుకు చిహ్నంగా ఉన్న ఏనుగు ఆమె పాదాల వద్ద కనిపిస్తుంది. క్షీరసాగరం నుండి పుట్టిన శ్రీ మహాలక్ష్మీ దేవి, క్షీర సముద్రం చిలికినప్పుడు, తన భక్తులకు ఐశ్వర్యం, 'సర్వ సౌభాగ్యాలు' (అన్ని ప్రాపంచిక సుఖాలు) మరియు అష్ట ఐశ్వర్యాలు (అష్ట ఐశ్వర్యాలు) మరియు 'అష్ట సిద్ధిలు (ఎనిమిది సాఫల్యాలు) మహాలక్ష్మీ ప్రసాదిస్తుంది.

# కాత్యాయనీ దేవిగా జగన్మాత

**విజయవాడ పశ్చిమ, సెప్టెంబర్ 26(జర్నలిస్ట్‌ఫైల్):**



కెబిఎన్ కళాశాల ప్రాంగణంలోని శ్రీ దాసాంజనేయస్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవ రాత్రి మహోత్సవాల్లో అమ్మవారిని గురువారం కాత్యాయనీదేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యపూజ, మంట పార్చనల అనంతరం వేదపం డితులు గరిమెళ్ళ శరవణ దీక్షితులు, దేవరకొండ శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో సామూహిక చండీహోమాలు జరిగాయి. సామూహిక కుంకుమార్చనలో 100 మంది ముత్తయిదువులు పాల్గొని, కాత్యాయ నీదేవికి అర్చనలు చేసారు. హిందూ హైస్కూల్స్ కమిటీ జనరల్ సెక్రటరీ గోపిశెట్టి మల్లయ్య, ట్రెజరర్ గోళ్ళ బాబా విజయ్ కుమార్, కెబిఎన్ కళాశాల సెక్రటరీ డాక్టర్ తూనుకుంట్ల శ్రీనివాసు తదితరులు యాగంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో చండీహోమాలు, పూజా కార్యక్రమాలు జరిగాయి.

# కాత్యాయిని దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ వాసవి మాత



**పెడన, సెప్టెంబర్ 26(జర్నలిస్ట్‌ఫైల్):**

కృష్ణాజిల్లా, పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి క్షేత్రము నందు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు డా. కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో శ్రీదే వి శరన్నవరాత్ర దసరా మహోత్సవములు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 4వ రోజు భక్తులకు శ్రీ కాత్యాయని దేవిగా దర్శనమిచ్చిన ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి మాత. ఈరోజు ఉభయ దాతులైన వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ నేషనల్ డిప్యూటీ చైర్మన్ కంతేటి ఉషారాణి మానేపల్లి సత్యనారాయణ అనురాధ కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం అధికారి ప్రతినిధి చిట్టూరి పశుపతినాథ్ బాబు మహాలక్ష్మిదంపతులచే దంపతులచే ఉదయం తీర్థపు బిందె ఊరేగింపు గణపతి పూజ శివపార్వతులకు అభిషే



కం శ్రీ వాసవి మాత ఉత్సవిగ్రహానికి అభిషే కములు శ్రీ కాత్యాయని దేవి హోమం తదితర పూజా కార్యక్రమాలను వాసవి క్షేత్రం ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ సాయిబాబు నేతృత్వంలో కోట సతీష్ శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక కుంకుమ పూజ కార్యక్రమంలో 100 మంది మహిళా భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణ శ్రీ వాసవి మహిళా మండలి కెసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన కార్యవర్గ సభ్యులు మహిళా భక్తులు భగవద్గీత పారాయణ అత్యంత భక్తిశ్రద్ధలతో చదివారు. పెడన పట్టణ పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీ వాసవి మాతను దర్శించుకున్న భక్తులకు ఉభయ దాతలు కంతేటి ఉషారాణి మానేపల్లి సత్యనారాయణ అనురాధ చిట్టూరి పశుపతినాథ్ బాబు మహాలక్ష్మి కుటుంబ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్య క్రమంలో పెడన మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేసు శ్రీనివాస్ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు కొల్లిపర నరసింహారావు కార్యదర్శి జవాజి నాగు ఆర్థిక సలహాదారులు సమయమంతులు ముత్యాలరావు ఉత్సవాల కమిటీ కన్వీనర్ కొల్లూరి రాధాకృష్ణగుప్తా కార్యవర్గ సభ్యులు జల్లూరి సత్యనారాయణ బోదినపల్లి శ్యాం ప్రసాద్ సభ్యులు భవిరిశెట్టి నాగేశ్వరరావు ఉదయగిరి గోపాల్ శ్రీ వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు తమ్మన లక్ష్మి తాయారు కెసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన అధ్యక్షురాలు కొమ్మూరి విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు కొండంత ఆదర్శంగా బీకేఆర్ వృద్ధాశ్రమం




**గన్నవరం, సెప్టెంబర్ 26(జర్నలిస్ట్‌ఫైల్):**

కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, గన్నవరం పట్టణంలో బస్టాండ్ సమీపంలో రీచ్ ప్రాంగణం నందు బీకేర్ వృద్ధాశ్రమం 3వ బ్రాంచ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు చిగురుపాటి కుమార స్వామి దంపతులు విచ్చేసి వృద్ధాశ్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కుమార స్వామి మాట్లాడుతూ వృద్ధులే కుటుంబ చారిత్రక ఆనవాళ్లు, వారి సంరక్షణ ఎంతో ముఖ్యం. గత 10 సంవత్సరాల నుండి వృద్ధుల సంరక్షణకు కట్టుబడి, వారికి బాసటగా నిలుస్తూ నేడు సకల హంగులతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో బీ కే ఆర్ వృద్ధాశ్రమం 3 వ బ్రాంచ్ ను గన్నవరంలో ప్రారంభించడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. వృద్ధాశ్రమంలో కార్యాలయాన్ని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్ ప్రారంభించి మాట్లాడుతూ వృద్ధుల సేవే పరమావధిగా అకుంఠిత దీక్షతో ఆశ్రమాన్ని 10 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న కానూరి శేష మాధవి సేవలు ఆదర్శవంతమని అన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ చైర్మన్ కానూరి శేష మాధవి మాట్లాడుతూ ఆశ్రమంలో వృద్ధులు ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉత్సాహంగా గడపడానికి సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఎల్లపుడూ ఆరోగ్య సేవలు అందుబాటు లో ఉంచుతూ పరిశుభ్రమైన ఆహారం, నీరు, శుభ్రమైన వాతావరణంలో ఇతర సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీ కే ఆర్ వృద్ధాశ్రమం కార్యదర్శి శ్రీ సత్య వేద కుమార్ (ఖన్నా) ,సమరసత సేవా సంస్థ అధ్యక్షుడు పాకాల త్రినాథ్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాదెండ్ల మోహన్, నీటి సంఘాల అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, బీజేపీ గన్నవరం మండల అధ్యక్షుడు నీలం అశోక్, పోలవరపు అనిల్, తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులకు ఆహ్వానితులకు ఆశ్రమ వైస్ చైర్మన్ బొకినాల అశోక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# కాత్యాయని అవతారంలో కనకదుర్గమ్మ







- అట్టహాసంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు
- జన కీలాద్రిని తలపిస్తున్న ఇంద్రకీలాద్రి
- పెద్ద ఎత్తున తరలివస్తున్న భక్తజన సందోహం
- ఉదయం 5 గంటల నుండి కిటకిటలాడుతున్న క్యూలైన్లు
- అమ్మ దర్శనానికి మూడు గంటలకు పైగా సమయం
- అడ్డు అదుపు లేని వీఐపీల రాక
- చేతులెత్తేసిన ఆలయ అధికారులు
- మొత్తం తమ ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు

**విజయవాడ, సెప్టెంబర్ 26(జర్నలిస్ట్‌ఫైల్):**

లోకకంటకులైన రాక్షసులను అంతమొందించుటకు ముక్కోటి దేవతలు, త్రిమూర్తులు కాత్యాయనీదేవి కి తాగిన శక్తిని ప్రసాదించి లోకకళ్యాణం కావించడంతో కాత్యాయనీదేవి భక్తులపాలిట కల్పవల్లిగా పేరు పొందింది. ఆ తల్లిని ఆరాధించడం వల్ల చతుర్విధ పురు షార్థాలు సిద్ధిస్తాయని.. రోగములు, శోకములు, భయా లు నశిస్తాయని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు భక్తుల ఇంట వర్ధిల్లుతాయని ప్రతీతి. అటువంటి కాత్యా యనీ దేవి అలంకరణలో కనకదుర్గమ్మ వారు భక్తులకు సాక్షాత్కరించారు. విజయవాడలోని ఇంద్రకీలాద్రి పై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థా నంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవం గా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో నాలుగవ రోజు కనక దుర్గమ్మ వారు కాత్యాయని రూపంలో అమ్మవారికి దర్శనమిచ్చారు. కాత్యాయని కరుణించమ్మ కనక వర్షం కురిపించమ్మా అంటూ భక్తులు అమ్మవారి నామస్మరణను జపిస్తూ ఇంద్రకీలాద్రి కి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. గురువారం తెల్లవారుజామున 5 గంటల నుండే భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో క్యూ లైన్ లన్నీ కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. అమ్మ వారి ఆలయానికి ఉన్న అన్ని మార్గాల ద్వారా భక్తులు తరుముకొంటూ తోసుకొంటూ ముందుకు రావడంతో జనకెలాద్రిని ఇంద్రకీలాద్రి తలపిస్తోంది. మరోవైపు విఐపి ల తాకిడి రోజు రోజుకు పెరుగుతుం డడం, అడ్డు అదుపు, వేలపాల సమయంలో లేకుండా తరలి రావడం తో కొండపై గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. సాధారణ భక్తులకు అమ్మవారి దర్శనానికి సుమారు మూడు గంటలకు పైగా సమయం పడుతుం ది. మధ్యాహ్నం 11 గంటల వరకు కాస్త ప్రశాంతంగా ఉన్న వాతావరణం భక్తుల రాక మరింత పెరగడం అమ్మవారి నివేదనకు అప్పుడప్పుడు దర్శనాన్ని నిలుపు దల చేయడంతో వినాయకుడి గుడి వరకు క్యూలైన్లలో భక్తులు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. తండప తండాలుగా తరలివస్తున్న భక్తుల రాకతో గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో ఆలయ అధికారులు చేతులె త్తేశారు. పరిస్థితి చేయి దాటి పోతున్న సమయంలో పోలీసులు మొత్తం ఇంద్రకీలాద్రితో పాటు కనకదుర్గ నగర్ ఘాట్ రోడ్డు ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకుని వీఐపీల రాకను నియంత్రించడం తోపాటు ఘాట్ రోడ్ లోకి ఎటువంటి వాహనాలను అనుమతిం చకుండా కట్టడి చేసే ప్రయత్నం చేశారు. అయితే ఘాట్ రోడ్డు ద్వారా కూడా భక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చేం దుకు ఎగబడి రావడంతో అక్కడ కాస్త ఆందోళన కర పరిస్థితి నెలకొండడం, వారిని నియంత్రిం చేందుకు పోలీసులు సైతం నానా కష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

## శుక్రవారం తెల్లవారుఝామున
# మూడు గంటల నుంచే దర్శనం



- శ్రీ మహాలక్ష్మిగా దర్శనం ఇవ్వనున్న అమ్మవారు
- దుర్గగుడి ఈవో శీనా నాయక్

**విజయవాడ, సెప్టెంబర్ 26(జర్నలిస్ట్‌ఫైల్):**

దసరా శరన్నవరాత్రులలో ఐదవ రోజైన శుక్రవారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మి గా భక్తులకు దర్శనమిస్తారని దుర్గగుడి ఈవో శీనా నాయక్ తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల నుంచే భక్తులను దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా కొందరు వీఐపీలు బంగారు వాకిలి నుంచే అమ్మవారిని దర్శించుకున్నారని, మిగిలిన వారు కూడా ఇదే రీతిలో దర్శించుకుంటే సామాన్య భక్తులకు మరింత త్వరగా దర్శనం లభిస్తుందని చెప్పారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండకుండా చూడాల్సిన బాధ్యత అందరి పైన ఉందని చెప్పారు. గురువారం నాడు అమ్మవారు శ్రీ కాత్యాయనీ దేవి గా దర్శనమిచ్చారని, పది సంవత్సరాలకు ఒకసారి ఈ అలంకారంలో దర్శనమిస్తారని చెప్పారు. అందువల్లనే గురువారం భక్తుల తాకిడి పెరిగిందని వెల్లడించారు.

**గురువారం సాయంత్రానికి 29 లక్షల ఆదాయం**

నాల్గవ రోజు సాయంత్రం 5 గంటలకు 66,313మంది భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నట్లు చెప్పారు. రాత్రి గం. 12 వరకు అమ్మవారినీ దర్శించుకునే అవకాశం ఉన్నందున ఈ సంఖ్య మరింత పెరగవచ్చని తెలిపారు. చిన్నారులు తప్పిపోకుండా 6,483 ట్యాగ్ లు చిన్నపిల్లలకు వేశామన్నారు. 18,028 మందికి అన్న ప్రసాద విచారణ చేసినట్లు తెలిపారు. దసరా ఉత్సవాలలో నాల్గవ రోజు సాయంత్ర సమ యానికి పలు రకాల సేవలు, దర్శన టికెట్ల విక్రయ రూపేణా రూ. 29లక్షల 63 వేల 455 రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. మూడు వందల రూపాయలు టిక్కెట్లు 2,351 విక్రయించగా 7,05,3 00 ల రూపాయలు, వంద రూపాయల టిక్కెట్లు 2,626 విక్రయించగా 2,62,600 రూపాయలు, 15 రూపాయల లడ్డులు 14,866 విక్రయించగా 2లక్షల 22వేల 990 రూపాయలు , వందరూపాయల లడ్డు బాక్స్ లు 15,899 విక్రయించగా రూ.15,89,900 ఆదాయం వచ్చిందన్నారు. ఇది కాకుండా పరోక్షంగా జరిగిన ప్రత్యేక కుంకుమార్చనల ద్వారా 56 వేలు, ప్రత్యేక పరోక్ష చండిహోమం ద్వారా 12 వేలు అదేవిధంగా ప్రత్యేక ఖడ్గమాలార్చన ద్వారా రూ.25,580 ఫోటో& క్యాలెండర్ల విక్రయం ద్వారా 5,500 రూపాయలు, కేశఖండన ద్వారా రూ.79, 400, ఇతరత్రా 4,185 రూపాయల ఆదాయం వచ్చిందని తెలిపారు.

# కాత్యాయని అవతారంలో కనకదుర్గమ్మ



**ఆగిరిపల్లి, సెప్టెంబర్ 26(జర్నలిస్ట్‌ఫైల్):**

ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం గ్రామంలో శరన్నవరాత్రుల సందర్భంగా జగన్మాత శ్రీదుర్గా మాతకు అష్టోత్తర సహస్ర కుంకుమార్చన, శ్రీ లక్ష్మీ పారాయణం, పండితులు కుందుర్తి సురేష్ ఆధ్వర్యంలో జరిపించారు. విశేష అలంకరణతో శ్రీ కాత్యాయని అమ్మవారు రూపంలో దర్శనమిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు నండూరు మంజుల, నూజివీడు వైఎస ఆర్సిపి వాలంటీర్ వింగ్ అధ్యక్షులు నండూరు భాస్కర ప్రసాద్ దంపతులతోపాటు మాజీ సర్పంచ్ మరియు నూజివీడు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి రైతు అధ్యక్షులు ఈలప్రోలు వెంకటసుబ్బయ్య, మాజీ గ్రామ ఉపసర్పంచ్ వేణుగోపాలరావు,వీరంకి రాఘవయ్య, ఆరేపల్లి రామకృష్ణ, వీరంకి శివశంకర్, వీరంకి నరసింహారావు, వణుకూరు కోటేశ్వరరావు మరియు మహిళా భక్తులు, గ్రామస్తులు విశేషంగా పాల్గొని ఆ యొక్క అమ్మవారి తీర్థ ప్రసాదాల స్వీకరించడం జరిగింది.

# పెరిగిన భక్తుల తాకిడి





- కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సహా.. ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ
- భక్తులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా చూస్తున్న ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, విజయవాడ కమిషనర్ ధ్యానచంద్ర, ఈవో శీనా నాయక్

**విజయవాడ, సెప్టెంబర్ 26(జర్నలిస్ట్‌ఫైల్):**

నవరాత్రి ఉత్సవాలు నాలుగవ రోజుకు చేరుకున్నాయి. రెండవ రోజు నుంచి క్రమంగా భక్తుల సంఖ్య పెరగడం ప్రారంభించింది. నాలుగవ రోజు గురువారం శ్రీ కాత్యాయనీ దేవి అలంకృత అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఇంద్రకీలాద్రి పర్వతానికి చేరుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "స్త్రీ శక్తి" పథకం ప్రభావం వల్ల మహిళా భక్తుల సంఖ్య బాగా పెరిగింది. భక్తుల సంఖ్యను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ రియల్ టైం డేటా ఆధారంగా ఎవరికీ ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తుండటంతో పాటు భక్తులకు అవసరమైన కనీస అవసరాలతో పాటు మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మిశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి శీనా నాయక్, నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్రలు అన్ని దశల్లోనూ భక్తుల అవసరాలను గమనిస్తున్నారు. ప్రధానంగా క్యూలైన్లలోని సాధారణ భక్తులకు మంచినీరు, పాలు పంపిణీతో పాటు ఎవరైనా అనారోగ్య పరిస్థితులు ఎదుర్కొన్న సమయంలో అవసరమైన వైద్య సహాయం వంటి అంశాలతో సహా దర్శనా నంతరం లడ్డు విక్రయ కేంద్రాలు, అన్న ప్రసాద స్వీకరణ కేంద్రాలలో రద్దీని తగ్గించేందుకు అవసరమైన చర్యలు ఎప్పటికప్పుడు తీసుకోవాల్సిందిగా క్షేత్రస్థాయి అధి కారులను ఆదేశిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలు పూర్త య్యేంతవరకు ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధితో అమ్మవా రికి సేవ చేస్తున్నామనే భక్తి భావంతో విధులు నిర్వహించాలని ఉన్నతాధికారులు తమ తమ విభాగాలకు చెందిన సిబ్బందిని ఆదేశించారు.

# జీఎస్టీ సవరణలపై ప్రతిపక్షాల తప్పుదారి

## పన్నుల దోపిడీ అంతా కాంగ్రెస్ హయాంలోనే

## లక్నో అంతర్జాతీయ ట్రేడ్ ఎక్స్‌పోలో ప్రధానిమోడీ



**లక్నో, సెప్టెంబరు 26:** జీఎస్టీ రేట్ల తగ్గింపు అంశంపై కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలు ప్రజలను తప్పుదారి పట్టించాయని ప్రధాని నరేంద్ర మోడీ విమర్శించారు. టూత్‌పేస్ట్ నుంచి ట్రాక్టర్ల వరకు ప్రతి వస్తువు ధరలపై పన్నుభారం తగ్గిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాల హయాంలో పన్ను దోపిడీ జరిగిందన్న ఆయన భారీ పన్నులతో ప్రజలపై భారం మోపారని మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనను ప్రారంభించిన మోడీ మాట్లాడుతూ మూడురోజుల కిందట జీఎస్టీ సంస్కరణలు అమలులోకి వచ్చాయని, ఇది నిర్మాణాత్మక మార్పుగా పేర్కొన్నారు. ఇవి భారతదేశ వృద్ధి కథకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయని తెలిపారు. ఈ సంస్కరణలు జీఎస్టీ నమోదును సులభతరం చేస్తాయని.. పన్ను వివాదాలను తగ్గిస్తాయన్నారు. ఎంఎస్ఎంఇలకు రిటర్న్ను వేగవంతం చేస్తాయని ప్రతి రంగానికి ప్రయోజనం చేకూరుస్తాయన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు దేశ ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తాయన్నారు.

2014కి ముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్, మిత్రపక్షాలు తమ ప్రభుత్వ వైఫల్యాలను దాచడానికి ప్రజలకు అబద్ధాలు చెబుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో పన్నుల ద్వారా భారీ దోపిడీ జరిగిందని దోచుకున్న డబ్బును మరింత దోచుకున్నారని, దేశంలోని సామాన్య పౌరుడు పన్ను భారంతో ఇబ్బందిపడ్డాడని ప్రధాని పేర్కొన్నారు. తన ప్రభుత్వం పన్నులను గణనీయంగా తగ్గించిందని, ద్రవ్యోల్బణాన్ని అరికట్టిందని, ప్రజల ఆదాయంతో పాటు పొదుపును పెంచిందన్నారు. రూ.12లక్షల వరకు ఆదాయాన్ని పన్ను నుంచి మినహాయించడం ద్వారా కొత్త జీఎస్టీ సంస్కరణలను అమలు చేయడం ద్వారా పౌరులు ఈ ఏడాది రూ.2.5లక్షల కోట్లు ఆదా చేస్తారన్నారు. దేశం జీఎస్టీతో పొదు పండుగ జరుపుకుంటోందన్నారు.

2014కి ముందు అధిక పన్ను భారం వ్యాపార ఖర్చులు, గృహా బడ్జెట్‌ను నిర్వహించడం కష్టతరం చేసిందని.. 2014కి ముందు రూ.1000 రేటుఉన్న చొక్కాపై రూ.170 పన్ను విధించారన్నారు. 2017లో జీఎస్టీ అమలులోకి వచ్చాక ఈ పన్ను రూ.50కి తగ్గిందన్నారు. సెప్టెంబర్ 22న అమలులోకి వచ్చిన సంస్కరణలతో అదే రూ.1000 విలువైన షర్ట్‌పై జీఎస్టీ రూ.35 మాత్రమేచెల్లించాల్సి ఉంటుందన్నారు.

2014లో టూత్‌పేస్ట్, షాంపూ, హెయిర్ ఆయిల్, షేవింగ్ క్రీమ్ వంటి ముఖ్యమైన వస్తువులపై రూ.100 ఖర్చు చేస్తే రూ.31 పన్ను విధించారని, బిల్లు రూ.131 పెరిగిందని ఆరోపించారు. 2017లో జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత రూ.100 విలువైన వస్తువు ధర రూ.118కి తగ్గిందని, అంటే రూ.13 ఆదా అవుతుందని.. ఇటీవలి జీఎస్టీ సంస్కరణల తర్వాత ఈ ఖర్చు రూ.105కి తగ్గిందని, ఫలితంగా 2014 ముందు రేట్లతో పోలిస్తే ప్రజలకు మొత్తం రూ.26 ఆదా అవుతుందన్నారు.

2014లో నిత్యావసరాల కోసం ఏడాదికి రూ.లక్ష ఖర్చు చేసే కుటుంబం రూ.20వేల నుంచి రూ.25వేలవరకు పన్నులు చెల్లించాల్సి ఉంటుందని జీఎస్టీ సంస్కరణల తర్వాత రూ.5వేల నుంచి రూ.6వేలు మాత్రమే చెల్లిస్తుందన్నారు. 2014కి ముందు ట్రాక్టర్ కొనుగోలు చేసేందుకు రూ.70వేల కంటే ఎక్కువగా పన్ను చెల్లించేదని ఇప్పుడు అదే ట్రాక్టర్‌పై రూ.30వేల మాత్రమే ఖర్చు అవుతుందని రూ.40వేల కంటే ఎక్కువగానే ఆదా అవుతుందని ప్రధాని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలన నాటి రోజుల పోలిస్తే ప్రస్తుతం స్కూటర్ల ధరలు రూ.8వేల నుంచి రూ.9వేలు తగ్గుతాయన్నారు. సంస్కరణల పేద, మధ్య తరగతుల వారందరికీ జీఎస్టీ సంస్కరణలతో ప్రయోజనం చేకూరుస్తాయని ప్రధాని వివరించారు.

# అగ్ని ప్రైమ్ క్షిపణి పరీక్ష విజయవంతం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26:** భారత రక్షణ పరిశోధన సంస్థ(డిఆర్‌డిఒ) ఆధ్వర్యంలో నూతనంగా అభివృద్ధి చేసిన మధ్యశ్రేణి రేంజ్ 'అగ్ని ప్రైమ్ క్షిపణి' పరీక్ష విజయవంతమైంది. ఈమేరకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్' ఖాతాలో వీడియోను షేర్ చేశారు. డిఆర్‌డిఒ శాస్త్రవేత్తలను అభినందించారు. ముఖ్యంగా భారత్‌వంటిదేశాలకు స్వల్ప, మధ్యస్థ, దీర్ఘశ్రేణి క్షిపణుల పరీక్ష అనేది సాధారణమే. అయితే ఇది సాధారణ క్షిపణి పరీక్ష కాదు. 2 వేల కి.మీ పరిధి కల్గిన అణ్వాయుధ సామర్థ్యం. గత అగ్ని ప్రైమ్‌ను భారతీయ రైల్వే లోకోమోటివ్ లాగిన్ లాంచ్ బెడ్ నుండి ప్రయోగించారు. ఈ ప్రయోగంతో రష్యా, అమెరికా, చైనా వంటి ఎలైట్ జాబితాలో భారత్ చేరింది. రైల్‌కార్ ఆధారిత ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు లేదా ఐసీబీఎంలను ప్రయోగించగల సామర్థ్యం కలిగి ఉంది. "ఈ రకమైన మొట్టమొదటి ప్రయోగం ప్రత్యేకంగా రూపొందించిన, రైలు ఆధారిత మొబైల్ లాంచర్ నుండి నిర్వహించబడింది" అని రక్షణ మంత్రి అన్నారు. ముందస్తు షరతులు లేకుండా రైలు నెట్‌వర్క్‌లో కదలగల సామర్థ్యం ఉంది. ఇది తక్కువ ప్రతిచర్య సమయం, క్రాస్-కంట్రీ మొబిలిటీని అనుమతిస్తుంది అని రాజ్‌నాథ్ సింగ్ తన ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు. ఈ విజయవంతమైన పరీక్ష భారత్‌ను ఆన్-ది-మూవ్ రైలు నెట్‌వర్క్‌ల నుండి క్యానిస్టరైజ్డ్ లాంచ్ సిస్టమ్‌లను అభివృద్ధి చేసిన ఎంపిక చేసిన దేశాల సమూహంలో చేర్చింది అని రక్షణ మంత్రి పేర్కొన్నారు.



# బీహార్ ఎన్నికల బిజెపి ఇన్‌చార్జిగా ధర్మేంద్ర ప్రధాన్

## బెంగాల్‌కు భూపేందర్ యాదవ్, తమిళనాడుకు బైజయంత్ పాండ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26:** బీహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలకు బిజెపి ఎన్నికల ఇన్‌చార్జీలను ప్రకటించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇప్పటికే ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్ షా బీహార్‌లో విస్తృతంగా పర్యటిస్తూ అనధికారికంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారం నిలబెట్టుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే బిజెపి అగ్రనాయకత్వం ఆ పార్టీ అగ్రనేత, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జిగా నియమించింది. ప్రధాన్‌తోపాటు కేంద్ర జల్ శక్తి మంత్రి సిఆర్ పాటిల్, ఉత్తర్ ప్రదేశ్ మంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్యలను సహ ఇన్‌చార్జులుగా వ్యవహరించనున్నారు. మరో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌ను పశ్చిమబెంగాల్‌కు ఇన్‌చార్జిగా ప్రకటించింది. ఆయనకు తోడుగా, త్రిపుర మాజీ సిఎం బిప్లబ్ కుమార్ దేబ్‌ను నియమించింది. ఢిల్లీకి చెందిన బిజెపి జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ పాండాకు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహుల్ పాండాకు సహాయకారి పనిచేయనున్నాడు.

# సౌదీ గ్రాండ్ ముఫ్తీ కన్నుమూత

**దుబాయి, సెప్టెంబరు 26:** సౌదీ సామ్రాజ్యానికి ఇస్లామిక్ వ్యవహారాల సలహాదారుగా సుమారు రెండు దశాబ్దాలకుపైబడి పనిచేసిన గ్రాండ్‌ముఫ్తీ షేక్ అబ్దుల్ అజజ్ బిన్ అబ్దుల్లా బిన్ మొహ్మద్ ఆల్‌షేక్ కన్నుమూసారు. సౌదీ సామాజిక సరళీకరణకు కృషిచేసిన ఇస్లామిక్ పండితునిగా ఆయనకు పేరు ప్రఖ్యాతులు లభించాయి. గ్రాండ్ ముఫ్తీగా ఆయన సున్నీ ముస్లిం ప్రపంచంలో కీలక పాత్రపోషించారు. మహిళలడ్రైవింగ్‌కుఅనుమతించడాన్ని సినిమా థియేటర్ల ప్రారంభాన్ని, సామాజిక సరళీకరణను సమర్థించారు. ఉగ్రవాదసంస్థల కార్యకలాపాలు తీవ్రంగా వ్యతిరేకించారు. ముఫ్తీ మరణంతో సౌదీ అరేబియా ఒకగొప్ప విజ్ఞాన నిపుణుడిని కోల్పోయిందని సౌదీ రాజాస్థానం ప్రకటన విడుదలచేసింది.

# వితంతువు ఆస్తులు పిల్లలు లేకుంటే భర్త వారసులకే

## సుప్రీం కోర్టు సంచలన తీర్పు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** హిందూ వారసత్వ చట్టంపై సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఒక హిందూ మహిళ వీలునామా రాయకుండా భర్త, పిల్లలు లేకుండానే చనిపోతే, ఆమె ఆస్తి పుట్టింటి కుటుంబానికి కాకుండా భర్త వారసులకే చెందుతుందని కోర్టు పేర్కొంది. ఈ విషయంలో హిందూ సంప్రదాయాలు, వివాహ వ్యవస్థను పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. హిందూ వారసత్వ చట్టం 1956లోని సెక్షన్ 15(1)(బి)ని సవాల్‌చేస్తూ దాఖలైన ఒక పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ బి.వి. నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారిస్తూ.. పిటిషనర్ల వాదనలకు ముందు కొన్ని ముఖ్య విషయాలను గుర్తు చేసింది. "ఇది హిందూ వారసత్వ చట్టం. హిందూ అంటే ఏమిటి, హిందూ సమాజం ఎలా నియంత్రించబడుతుంది, దాని అర్థం ఏమిటో దయచేసి గుర్తుంచుకోండి. మీరు ఆ పదాలను ఉపయోగించడానికి ఇష్టపడకపోవచ్చు కానీ కన్యాదానం జరిగినప్పుడు ఒక మహిళకు గోత్రం మారుతుంది, పేరు మారుతుంది. ఆమెభర్తనుంచి జీవన భృతిని కోరగలదు" అని ధర్మాసనం పేర్కొంది. జస్టిస్ నాగరత్న దక్షిణ భారతదేశంలోని కొన్ని సంప్రదాయాలనుకూడా ప్రస్తావించారు. "దక్షిణ భారత దేశంలో జరిగే వివాహాలలో.. ఒకగోత్రం నుంచి మరొక గోత్రంలోకి మారుతున్నట్లు ఆచారబద్ధంగా ప్రకటిస్తారు. మీరు ఈ వాస్తవాలన్నింటినీ విస్మరించలేరు" అని ఆమె అన్నారు. ఒక మహిళ వివాహం చేసుకున్న తర్వాత చట్టం ప్రకారం ఆమె బాధ్యత భర్త, అతని కుటుంబంపై ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆమె తన తల్లిదండ్రుల లేదా తోబుట్టువుల నుంచి జీవన భృతిని కోరలేదని గుర్తు చేసింది. ఒకమహిళ వివాహం చేసుకుంటే..చట్ట ప్రకారం ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించింది. అలాగే భర్త, అత్తమామలు, పిల్లలు, భర్త కుటుంబమే ఉంటుందని కోర్టే సమాధానం కూడాచెప్పింది. ఆమె తన సోదరుడిపై జీవన భృతి పిటిషన్ దాఖలు చేయలేదని కూడా వ్యాఖ్యా నించింది. ఒకమహిళకు పిల్లలు లేనట్లయితే.. ఆమె ఎప్పుడైనా వీలునామా రాసుకోవచ్చని జస్టిస్ నాగరత్న తెలిపారు. ఈ చట్టం అన్యాయం, వివక్షతో కూడుకున్నదని సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ వాదించారు. "ఒక పురుషుడు వీలునామా లేకుండా మరణిస్తే.. అతని ఆస్తి అతని కుటుంబానికి చెందుతుంది. మరి ఒకమహిళ పిల్లలులేనప్పుడు ఆమె ఆస్తి కేవలం ఆమె భర్త కుటుంబానికి మాత్రమే ఎందుకు చెందాలని ఆయన ప్రశ్నించారు. ఈ వాదనపై ధర్మాసనం స్పందిస్తూ న్యాయనిర్ణయాల ద్వారా వేల సంవత్సరాలుగా ఉన్న సంప్రదాయాలను మార్చడం సరికాదని హెచ్చరించింది.

# పెళ్లికోసమే మతమార్పిడి అయితే చెల్లదు!

## అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు



**అలహాబాద్, సెప్టెంబరు 26:** వివాహం కోసం జరిపే మతమార్పిడి చట్టవిరుద్ధమని తేలితే, ఆ వివాహానికి ఎలాంటి చట్టబద్ధత ఉండదని అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. అలాంటి పెళ్లి దానంతట అదే రద్దయిపోతుందని, చట్టం దృష్టిలో వారు భార్యాభర్తలుగా పరిగణించబడరని స్పష్టం చేసింది. ఒక జంట వివాహానికి సంబంధించిన కేసులో ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. హిందూ మతానికి చెందిన చంద్రకాంత, ముస్లిం మతానికి చెందిన మహమ్మద్ బిన్ కాసీం అలియాస్ అక్బర్ ప్రేమించుకున్నారు.

పెళ్లి చేసుకోవడం కోసం చంద్రకాంత ఇస్లాం మతంలోకి మారినట్లుగా ఓ సర్టిఫికెట్‌ను సృష్టించారు. ఖాన్‌కారే ఆలియా అరిఫీయా అనే సంస్థ ఈ ఏడాది ఫిబ్రవరి 22న ఈ ధ్రువపత్రం జారీ చేసినట్టుగా ఉంది. దాని ఆధారంగా మే 26న ఖాజీ వారికి ముస్లిం సంప్రదాయం ప్రకారం వివాహం జరిపించారు. అయితే, తమ కుమార్తెను మభ్యపెట్టి, నకిలీ సర్టిఫికెట్‌తో మతం మార్చి పెళ్లి చేసుకున్నారని చంద్రకాంత తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. మరోవైపు, తమ వివాహంలో ఎవరూ జోక్యం చేసుకోకుండా ఆదేశాలుఇవ్వాలని కాసీంకూడా పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం అసలు నిజాన్ని రాబట్టింది. విచారణలో భాగంగా ఖాన్‌కారే ఆలియా అరిఫీయా సంస్థను కోర్టు వివరణ కోరగా, తాము చంద్రకాంతకు ఎలాంటి మతమార్పిడి సర్టిఫికెట్‌ను జారీ చేయలేదని ఆ సంస్థ కార్యదర్శి స్పష్టం చేశారు.

దీంతో సమర్పించిన ధ్రువపత్రం నకిలీదని నిర్ధారణ అయింది. దీని ఆధారంగా మతమార్పిడే చట్టవిరుద్ధమైనప్పుడు, దానిపై ఆధారపడి జరిగిన వివాహం కూడా చెల్లదని న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అయితే, ఆ జంట కలిసి జీవించాలనుకుంటే మరో మార్గం ఉందని కోర్టు సూచించింది. మతమార్పిడి అవసరం లేని ప్రత్యేక వివాహ చట్టం కింద వారు తమ పెళ్లిని రిజిస్టర్ చేసుకోవచ్చని, దాని ద్వారా తమ బంధానికి చట్టబద్ధత కల్పించుకోవచ్చని న్యాయస్థానం మార్గం చూపింది.

# ఐరాసలో నాకు అవమానం..

## దర్యాప్తుకోసం సీక్రెట్ సర్వీస్‌కు ట్రంప్ ఆదేశం



**న్యూయార్క్, సెప్టెంబరు 26:** ఐరాస జనరల్ అసెంబ్లీలో ప్రసంగించేందుకు వెళ్లే క్రమంలో ఎదురైన చేదు అనుభవాలపై ట్రంప్ సీరియర్‌గా స్పందించారు. సీక్రెట్ సర్వీస్ దానిపై దర్యాప్తు చేపట్టాలని ఆదేశాలు చేశారు. ఈ విషయాన్ని ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'ఐరాసలో నిన్న నాకు అవమానం జరిగింది. ఒక్కసారి, రెండుసార్లు కాదు.. ఏకంగా మూడు దురదృష్టకర ఘటనలు జరిగాయి. తొలుత పైకి వెళుతున్న ఎస్కలేటర్ ఆగిపోయింది. ఆ తర్వాత టెలిప్రాంప్టర్ పని చేయలేదు. అది దాదాపు 15 నిమిషాలు ఆగిపోయింది. కానీ, నా ప్రసంగానికి అద్భుతమైన రివ్యూలు వచ్చాయి' అని పేర్కొన్నారు. ఇక ఆడిటోరియంలోని సౌండ్ సిస్టమ్ ఘోరంగా ఉందని ఎద్దేవాచేశారు. తాను మాట్లాడిన తర్వాత భార్య మెలానియా వైపు చూడగా.. ఆమె ఒక్క ముక్క కూడా వినిపించలేదని పేర్కొన్నారు. ఇది ఏదో యాదృచ్ఛికంగా జరిగింది కాదు. ఈ మూడూ ఉద్దేశపూర్వకంగా చేసినవే అని పేర్కొన్నారు. ఈలోపాలపై దర్యాప్తు చేపట్టాలని ఐరాస సెక్రటరీ జనరల్‌కు లేఖ రాస్తానని చెప్పారు. దీనిలో సీక్రెట్ సర్వీస్‌ను భాగస్వామి చేయాలన్నారు. అయితే దీనిపై ఐరాస ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ స్పందిస్తూ.. అమెరికా అధ్యక్షుడి బృందంలోని ఓ విడియోగ్రాఫర్ ట్రంప్-మెలానియాను ఎదుటినుంచి చిత్రీకరిస్తూ ఎస్కలేటర్ సేఫ్టీ వ్యవస్థను పొరబాటున నొక్కి ఉండొచ్చని తమ దర్యాప్తులో భావిస్తున్నామన్నారు. భార్య మెలానియాతో కలిసి సర్వప్రతినిధి సభకు వచ్చిన ఆయన.. సమావేశ ప్రాంగణానికి చేరుకునేందుకు ఎస్కలేటర్ ఎక్కారు.

వారిద్దరూ అలా అడుగుపెట్టారో, లేదో ఆ యంత్రం హఠాత్తుగా ఆగిపోయింది. వారు కాస్త తూలినట్లయ్యారు. దీంతో ఒక్క క్షణం అంతా బిత్తరబోయారు. మెలానియా కాస్త చొరవగా మెట్లెక్కి వెళ్లారు. ఆమె వెంటే ట్రంప్ అడుగులు వేశారు. ఈ విషయాలను ఆయన సమావేశంలో ప్రస్తావించారు. 'ఈ రోజు రెండు విషయాలు ప్రతికూలంగా జరిగాయి. ఒకటి చెత్త ఎస్కలేటర్.. రెండోది పనిచేయని టెలిప్రాంప్టర్. థాంక్యూ వెరీమచ్' అంటూ వ్యంగ్యంగా ప్రసంగాన్ని ప్రారంభించారు.

# జుబిన్‌గార్గ్ మృతిపై సమగ్ర దర్యాప్తునకు సిట్ ఏర్పాటు: అసోం సిఎం మహంత

**గువాహతి, సెప్టెంబరు 26:** అస్సామీ గాయకుడు జుబిన్‌గార్గ్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించేందుకు అస్సాం ప్రభుత్వం 10 మంది సభ్యులతో సిట్ ఏర్పాటుచేసింది. సిఐడి స్పెషల్ డైరెక్టర్ జనరల్ ఎంపి గుప్తా ఈ సిట్‌కు నేతృత్వం వహిస్తారు. నిర్దిష్టమైన వ్యవధిలోపు సమగ్ర నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వశర్మ ఆదేశాలు జారీచేసారు. గార్గ్ మృతికి సంబంధించి ఎవరి ప్రమేయం ఉన్నప్పటికీ ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. గార్గ్ మృతదేహంనుంచి సేకరించిన నమూనాలను సిఎఫ్ఎస్ఎల్‌కు పంపించామని సమగ్ర పరీక్షల నివేదిక వచ్చినతర్వాత మరింత వేగం పుంజుకుంటుందన్నారు. సిట్‌కు దర్యాప్తులో పూర్తిస్వేచ్ఛనిస్తున్నట్లు తెలిపారు. గార్గ్ తన స్నేహితులు, సహచరులతో ఈత కొడతుండగానే సముద్రంలో మునిగి చనిపోయారని చెపుతున్నారు. ఇందుకు సంబంధించి అస్సాంరాష్ట్రం మొత్తంగా కనీసం 54 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. దీనితో సిఎం గార్గ్ మృతిపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. గాయకుడు, గీతరచయిత, నటుడు, చిత్రనిర్మాత అయిన 52 ఏళ్ల జుబిన్‌గార్గ్ ఈనెల 19 నుంచి 22వరకూ ఈశాన్య ఉత్సవాలు నిర్వహించేందుకు సింగపూర్‌కు వెళ్లారు. అస్సాం పారిశ్రామికవేత్త శ్యాంకను మహంతా ఈ వేడుకలను నిర్వహించారు. ఆరోగ్యం సజావుగా లేకున్నా గార్గ్‌ను ఈతకొట్టేందుకు ఎవరు అనుమతించారన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. సిట్‌దర్యాప్తుపై గార్గ్ సతీ మణి, ఫ్యాషన్ డిజైనర్ గరిమా సైకియా గార్గ్ స్పందించారు. అస్సాం ప్రభుత్వం, దర్యాప్తుపైనా తనకు పూర్తి నమ్మకం ఉందని అన్నారు.

# సంక్షిప్తంగా..

## ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడికి ఐదేళ్లు జైలు, లక్ష యూరోల జరిమానా



**పారిస్, సెప్టెంబరు 26:** ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీకి ఐదేళ్ల జైలు శిక్ష పడింది. అంతర్జాతీయ వేదికపై లిబియా ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడానికి బదులుగా అక్రమ నిధులు పొందడానికి గడాఫీతో ఒప్పందం కుదుర్చుకున్నారని సర్కోజీపై ఆరోపణలొచ్చాయి. చట్టవిరుద్ధమైన నిధులపై లిబియాతో నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు పారిస్ కోర్టుగా దోషిగా తేల్చింది. ఐదేళ్ల జైలు విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది.లక్ష యూరోల జరిమానా విధించింది. అవినీతితో సహా ఇతర ఆరోపణల నుంచి సర్కోజీని నిర్దోషిగా ప్రకటించారు. గడాఫీతో అలాంటి ఒప్పందం కుదుర్చుకున్నారని లేదా లిబియా పంపిన డబ్బు సర్కోజీ ప్రచార ఖజానాకు చేరుకుందని అనడానికి ఎటువంటి రుజువు లేదని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. నికోలస్ సర్కోజీకి శిక్ష విధించడంఅంటే, అతను అప్పీలు దాఖలు చేయాలావద్దా అనే దానితో సంబంధం లేకుండా సర్కోజీ జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. కోర్టు తీర్పు అనంతరం నికోలస్ సర్కోజీ మీడియాతో మాట్లాడుతూ, తాను నిర్దోషినని, కోర్టు తనకు ఐదేళ్ల జైలు శిక్ష విధించిన తీర్పుపై అప్పీలు చేస్తానని అన్నారు.

## ఇండియాకు పెద్ద అభిమానినే కానీ..: అమెరికా మంత్రి క్రిస్‌రైట్

**న్యూయార్క్, సెప్టెంబరు 26:** తమ అద్భుత మిత్ర దేశమైన భారత్‌తో అమె రికా ఇంధన సహకారాన్ని విస్తరించుకోవాలని కోరుకుంటున్నట్లు అగ్రరాజ్య ఇంధన శాఖ మంత్రి క్రిస్ రైట్ తెలిపారు. ఉభయ దేశాల మధ్య ఇంధన, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారాన్ని బలోపేతం చేసే అంశంపై భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో చర్చించినట్లు వెల్లడించారు. న్యూయార్క్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో క్రిస్ రైట్ ఈ వ్యాఖ్యలుచేశారు. ఈ సందర్భంగా రష్యా చమురు కొనుగోలు అంశాన్నీ ఆయన ప్రస్తావించారు. 'నేను భారత్‌కు పెద్ద అభిమానిని. ఆ దేశమంటే మాకు చాలా ఇష్టం. ప్రపంచం లోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌తో ఇంధన వాణిజ్యాన్ని మరింత పెంచుకునేందుకు మేం ఎదురుచూస్తున్నాం. అయితే, ప్రస్తుతం ఆ దేశం మరో విషయంలో (రష్యా చమురు కొనుగోలును ఉద్దేశిస్తూ) చిక్కుకుంది' అని క్రిస్ రైట్ అన్నారు.

## మిగ్ - 21 వీడ్కోలులో స్క్వాడ్రన్ లీడర్ ప్రియాశర్మ!

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26:** వాయుసేన తన ఒకప్పటి తురుపుముక్క మిగ్-21 ఫైటర్ జెట్లకు ఘనంగా తుది వీడ్కోలు పలికేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో స్క్వాడ్రన్ లీడర్ ప్రియాశర్మ పేరు వార్తల్లో నిలిచింది. వాయుసేన చీఫ్ ఎపి సింగ్‌తో పాటు చివరి సార్టిలో పాల్గొనే పైలట్లలో ఈమె కూడా ఒకరు. సెర్మోనియల్ ఫ్లైపాస్ట్‌కు నిర్వహించిన రిహార్సల్స్‌లో ప్రియాశర్మ పాల్గొన్నారు. పాంథర్స్‌గా పిలిచే 23వ స్క్వాడ్రన్‌కు చెందిన మిగ్-21లు దీనిలో పాల్గొననున్నాయి. రాజస్థాన్‌లోని ఝున్‌ఝున్‌ను జిల్లాకు చెందిన ప్రియ ఇంజనీరింగ్ తర్వాత తండ్రి అడుగుజాడల్లోనే నడిచి వాయుసేనలో చేరారు. తన బ్యాచ్‌లో ఆమె ఒక్కరే మహిళ కావడం విశేషం. 2018లో 2018లో దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ప్రియాశర్మ గ్రాడ్యుయేషన్ చేశారు.

## పదిరోజుల్లో కేజీవాల్‌కు ఇంటిని కేటాయిస్తాం: కేంద్రం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు పది రోజుల్లోగా ప్రభుత్వ నివాసం కేటాయిస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ మేరకు ఢిల్లీ హైకోర్టుకు తెలియజేశారు. గురువారం వర్చువల్‌గా కోర్టు విచారణకు హాజరైన ఆయన జస్టిస్ సచిన్ దత్తాకు హామీ ఇచ్చారు. 'ఈరోజు నుంచి పది రోజుల్లోగా ఆయనకు (కేజ్రీవాల్) తగిన వసతి కేటాయిస్తాం. మీరు నా స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయవచ్చు' అని అన్నారు. కాగా, 2024 అక్టోబర్‌లో ఢిల్లీ సిఎం పదవినుంచి వైదొలిగిన అరవింద్ కేజ్రీవాల్, ఫ్లాగ్ స్టాఫ్ రోడ్‌లోని అధికార నివాసాన్ని ఖాళీచేశారు. నాటినుంచి మండి హౌస్ సమీపంలోని మరో పార్టీసభ్యుడి అధికారిక గృహంలో ఆయన నివసిస్తున్నారు.

## హాస్టల్ భవనంపైనుంచి దూకి ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

**పాట్నా, సెప్టెంబరు 26:** ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థిని హాస్టల్ బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ప్రిన్సిపాల్ వేధిస్తున్నట్లు విద్యార్థులుఆరోపించారు. బీహార్ రాజధాని పాట్నా సమీపంలోని చాంది ఇంజినీరింగ్ కాలేజీలో ఈ సంఘటనజరిగింది. ముంగేర్ జిల్లాలోని బరియార్‌పూర్ బ్లాక్‌కు చెందిన ఇంజినీరింగ్ రెండో ఏడాది విద్యార్థిని 20 ఏళ్ల సోనమ్ కుమారి సివిల్ ఇంజనీరింగ్ చదువుతోంది. బుధవారంరాత్రి హాస్టల్ బిల్డింగ్ మూడో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్ నందన్, స్టూడెంట్లను వేధించడంతోపాటు బెదిరిస్తున్నట్లు ఆరోపించారు. సోనమ్ రక్తం మడుగుల్లో అరగంట పడి ఉన్నప్పటికీ కాలేజీవాహనంలో ఆమెను హాస్పిటల్‌కుతరలించేందుకు ప్రిన్సిపాల్ నిరాకరించినట్లు విమర్శించారు.తర్వాత స్థానికఆసుపత్రికి తరలించగా అప్పటికేఆమెమరణించినట్లు డాక్టర్లు ధృవీకరించారు.

# సింధుజలాలు ఉత్తరాదికి మళ్లించే భారీ ప్రాజెక్టుకు శ్రీకారం



## డిపిఆర్ తయారీ ఎల్అండ్‌టికి అప్పగింత

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** ఉత్తరాది రాష్ట్రాల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింధూ నదీ వ్యవస్థలో భారీ మార్పులకు కేంద్రంలో మోడీ సర్కారు సిద్ధమైంది. సింధూ నదిపై భారీ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి 2029 ఎన్నిలకు ముందే సిద్ధం చేసే దిశగా అడుగులు వేస్తోంది. సింధూ నది వ్యవస్థలో భాగమైన సింధు, దాని ఉపనది బియాస్‌ను కలుపుతూ 14 కి.మీ పొడవైన సొరంగం నిర్మించేందుకు డిపిఆర్ సిద్ధమవుతోంది. ప్రాజెక్ట్ సమగ్రనివేదిక తయారీ బాధ్యతలను ప్రముఖ నిర్మాణ రంగ సంస్థ లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టి)కి అప్పగించారు. మొత్తం 113 కి.మీ. పొడవైన కాల్వ ద్వారా సింధూ నది జలాలను ఉత్తరాది రాష్ట్రాలకు మళ్లించే అంశాన్ని కూడా సమీక్షించినట్టు తెలుస్తోంది. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్‌ల మధ్య 1960లో సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరింది. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి తర్వాత 'నీళ్లు, రక్తం కలిసి ప్రవహించలేవు' అని పేర్కొంటూ ఈ ఒప్పందాన్ని తాత్కాలికంగా భారత్ నిలిపివేసింది. అప్పటి నుంచి సింధూ నదీ జలాల వాటాను పూర్తిగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఇవి కార్యరూపం దాల్చేలా ఇంటర్ బేసిన్ సింధు జలాల బదిలీ పథకం కింద ఒక ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్ట్‌ను ప్రభుత్వ అత్యున్నత స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో అత్యంత సవాల్‌గా నిలిచేది 14 కిలోమీటర్ల సొరంగం నిర్మాణం అని అధికార వర్గాలు చెబుతున్నాయి. అలాంటి సొరంగానికి పర్వత రాళ్లపై సవివరంగా అధ్యయనం అవసరం ఉంటుంది. రాళ్ల బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో సొరంగాన్ని పైపుల ద్వారా వేయాల్సి ఉంటుంది. దీనిపై ప్రభుత్వానికి డీపీఆర్ నివేదిక అందిన తర్వాతే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి. త్వరగా, సురక్షితంగా సొరంగ తవ్వకానికి బోరింగ్ మెషీన్లు, రాక్ షీల్డ్ టెక్నాలజీని వినియోగించాలని ప్రతిపాదించారు. జమ్మూ కశ్మీర్ కథువా జిల్లాలోని ఉఝా బహుళార్థకసాధక ప్రాజెక్ట్‌కు ఈ సొరంగాన్ని అనుసంధానం చేసి, రావి ఉప నది ఉఝా నదినుంచి నీటిని బియాస్ బేసిన్‌లోకి తరలిస్తారు. ఈ సొరంగంతో రావిబియాస్ సుట్లెజ్ వ్యవస్థ సింధు బేసిన్‌తో అనుసంధానమవుతుంది. దీని ద్వారా సింధూ నది జలాల్లో భారత్ తన వాటాను గరిష్టంగా వినియోగించుకునే అవకాశం లభిస్తుంది. అధికార వర్గాల అంచనాల ప్రకారం ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి మూడు నుంచి నాలుగేళ్లు పడుతుందని, 2028 నాటికి సిద్ధం కావచ్చని అంటున్నారు. దీనికి రూ.నాలుగునుంచి ఐదువేల కోట్ల వరకు వ్యయమవుతుందని అంచనా.

## ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయం



**○ రజకసత్రంలో ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే నసీర్**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం జమీందారీ వ్యవస్థపై ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, అసెంబ్లీ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. చాకలి ఐలమ్మ 130వ జయంతి సందర్భంగా నగరంలోని రజకసత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తొలుత ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో చాకలి ఐలమ్మ పోరాటం చరితాత్మకమన్నారు. భూమి నాది, పంట నాది.. మీ పెత్తనమేంటని దొరలని ప్రశ్నించిన వీరనారి అని కొనియాడారు. హక్కుల కోసం పోరాడటానికి ధైర్యం కావాలని, అప్పుడే బానిసత్వాన్ని జయించవచ్చని చాటిచెప్పారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గం పరిశీలకులు గంజం రాఘవేంద్ర, డిప్యూటీ మేయర్ సజీలా, జాగర్లమూడి శ్రీనివాసరావు, కార్పొరేటర్స్ ఇర్రి ధనలక్ష్మి, మీరవాలి, చీఫ్టి, డివిజన్ అధ్యక్షులు జ్యోతుల జస్వంత్, జడ సురేష్, మాదాసు శేఖర్, బంతల సాయిబాబు, కలికిపూడి అంకమ్మరావు, దుర్గాప్రసాద్, చట్టా కనకారావు, పొదిలి రమేష్, సంగేపు రాజేష్, మోపిదేవి రాజేష్, దమ్మాటి భాస్కర్, వల్లూరి సాయి చైతన్య, రావూరి మోహన్రావు, రాచకొండ లక్ష్మయ్య, వీరవల్లి బాలచంద్ర, ఈదర నాగేశ్వరరావు, గూడూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ క్రమశిక్షణ ప్రతిబింబించిన మెగా డీఎస్సీ బందోబస్తు



**○ అంకితభావంతో విధులు నిర్వహించిన పోలీసులకు ఐజీ, ఎస్పీ ప్రశంసలు**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** వెలగపూడి సచివాలయం వద్ద 25.09.2025న జరిగిన "మెగా డీఎస్సీ – 2025 ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం" బందోబస్తును పోలీసులు అత్యంత అంకితభావంతో, అప్రమత్తంగా, సమష్టి కృషి మరియు బాధ్యతతో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంలో గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠీ, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులు మరియు సిబ్బందిని అభినందించారు. సభా ప్రాంగణం, స్టేజ్ ర్యాంప్, వీవీఐపీ & వీఐపీ విభాగాలు, అభ్యర్థుల ప్రవేశ ద్వారాలు, వాహన రాకపోక మార్గాలు, పార్కింగ్ ప్రదేశాల వద్ద పోలీస్ సిబ్బంది ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎవరికి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించడం పోలీస్ శాఖ క్రమశిక్షణను ప్రతిబింబించినట్లుగా ఐజీ, ఎస్పీ పేర్కొన్నారు. బందోబస్తు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతృప్తి వ్యక్తం చేసినట్లు అధికారులు గుర్తు చేశారు. విధి నిర్వహణలో ఇదే అంకితభావం రాబోయే రోజుల్లో కొనసాగాలని ఐజీ, ఎస్పీ ఆకాంక్షించారు. సభకు హాజరైన అభ్యర్థులను పలకరించి, వారి వివరాలు తెలుసుకున్నారు. వాహనాల రాకపోకలు, పార్కింగ్ వ్యవస్థను ఎస్పీ స్వయంగా పర్యవేక్షించి, బందోబస్తు అధికారులకు సూచనలు చేశారు.

## బంగాళాఖాతంలో మరోఅల్పపీడనం..!



**○ నేటి నుంచి 29వ వరకు వర్షాలు**

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గురువారం(25వ తేదీ) ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

శనివారానికి దక్షిణ ఒడిశా–ఉత్తరాంధ్ర తీరాల వెంబడి వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని కారణంగా ఈ రోజు నుంచి 29వ తేదీ వరకు ఏపీ, తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా బలపడి శనివారం దక్షిణ ఒడిశా–ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ ప్రభావంతో బుధ, గురువారాల్లో పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీవర్షాలు, మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

# గుంటూరులో శుద్ధ జలం అందించేందుకు చర్యలు తీసుకోండి

**○ అధికారులను ఆదేశించిన కేంద్రమంత్రి పెమ్మసాని**

**○ గుంటూరులో వాటర్ ట్యాంకులు పరిశీలించిన మంత్రి**

**○ వాటర్ పైపులు లీక్ లేకుండా చూడాలి**

**○ అధికారులకు దిశానిర్దేశం చేసిన మంత్రి**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరులోని తక్కెల్లపాడు వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్, స్తంభాలగరువులోని వాటర్ ట్యాంక్ లను కలెక్టర్ అన్సారియా గారితో కలిసి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఫిల్టరేషన్ ప్లాంట్లో నీటిని శుద్ధి చేస్తున్న ప్రక్రియను పెమ్మసాని అడిగి తెలుసుకున్నారు. అలాగే ట్రీట్మెంట్ ప్రక్రియకు సంబంధించిన రికార్డులను మంత్రి పరిశీలించారు. ట్రీట్మెంట్ బెడ్ పరిశీలన యంత్ర పరికరాలతో పనిచేసే విధానాన్ని ఆయన పరిశీలించారు.

అనంతరం స్తంభాల గరువులోని వాటర్ ట్యాంక్ పై వరకు అధికారులతో కలిసి వెళ్లి పరిశీలించారు. పాత వాటర్ ట్యాంకు పై మూత లేకపోవడం వంటి సమస్యలను పెమ్మసాని పరిశీలించి అధికారులను వివరణ అడిగారు. అలాగే ఇటీవల నిర్మించిన వాటర్ ట్యాంకు గల ఇనుప మెష్ లను మరమ్మతులు చేయించి పక్షులు వెళ్లకుండా, పడిచనిపోకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే అవసరమైన మరమ్మతులను తక్షణ చర్యలు కింద చేపట్టి ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తామని ఈ సందర్భంగా పెమ్మసాని. స్పష్టం చేశారు.

అనంతరం ప్రజారోగ్య సమస్యలపై కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ తమిం అన్సరియా తో కలిసి పెమ్మసాని సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ గుంటూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో 11 లక్షలు జనాభా వున్నారుభారీ వర్షాల కారణంగా డయేరియా సమస్య. వచ్చిందన్నారు.

డయేరియా రావడానికి ఎన్నో కారణాలు ఉంటాయి గుంటూరు ఛానల్ ద్వారా అలాగే పైప్ లైన్ ద్వారా గుంటూరు పార్లమెంట్ ప్రజలకు నీటి సరఫరా జరుగుతుందని చెప్పారు. పైప్ లైన్ సరఫరాలో డ్రైనేజ్ వాటర్ లీక్ అవ్వడం సమస్య గాని గుంటూరు ఛానల్ ద్వారా కలుషితం జరగటం వలన సమస్య వచ్చే అవకాశం ఉందన్నారు. స్థానికంగా ఉన్నటువంటి ట్రీట్మెంట్ ప్లాంట్లను, అలాగే వాటర్ ట్యాంకులను మంత్రి పరిశీలించారు. నగరంలో 167 శాంపిల్ సేకరిస్తే అందులో 21 శాంపిల్స్ కలుషితమైనట్లు తెలిసింది రూ. 15 కోట్ల తో రీజర్వాయర్లను ఆధునీకరిస్తామన్నారు. రిజర్వాయర్ దగ్గర సీసీ టీవీ లు ఏర్పాటు చేసి అక్కడ పని చేసే వారిని పర్యవేక్షించాలిఅలాగే కొన్నిచోట్ల పానీపూరి బళ్ళు దగ్గర ప్రాంతాల్లో సమస్య ఉందని అధికారులు చెబుతున్నారు. వాటర్ ట్యాంకులకు పైన మూతలు లేనిచోట్ల ఈ సమస్య ఎక్కువగా ఉంది.

ఆయా వాటర్ ట్యాంకులకు వెంటనే మరమతులు చేయించి మూతలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా వాటర్ ట్రీట్మెంట్ జరిగే చోట వాటర్ ట్యాంకుల వద్ద వీడియో కెమెరాలు(సీసీటీవీలు) ఏర్పాటు చేసి రెగ్యులర్ మోనిటరింగ్ సిస్టం ఏర్పాటు చేయాలి అని ఆలోచించామన్నారు. నీటి శుభ్రత ప్రజారక్షణ వంటి జయాలతో కొంతమంది సీనియర్ సిటిజన్ల లో స్వచ్ఛందంగా పనిచేయడానికి కొందరు సిద్ధంగా ఉన్నారు. అలాంటి వారందరిని ఒక చోటకి తీసుకువచ్చి ఈ నీటి శుభ్రత ప్రజలకు శుద్ధమైన నీటి సరఫరా వంటి అంశాలపై ఒక కమిటీగా ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నాము. జిజిహెచ్ లో కూడా ఇలాగే హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ పెట్టి మార్పు తెచ్చామని మంత్రి చెప్పారు. కంటామినేషన్ జరగకుండా రాపిడ్ కమిటీ టీంను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేలాగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతానికి ధైర్య కేసులు ఏమి పెద్దగా లేవు చాలా వరకు తగ్గిపోయాయి ఎలాంటి ప్రాణాపాయం లేదని స్పష్టం చేశారు. పానీపూరి బళ్ళను, చిన్న చిన్న వ్యాపారులను మూసివేయాల్సిన అవసరం లేదన్నారు. శుద్ధమైన నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశామన్నారు. డ్రైన్ సిస్టం, పాత వాటర్ ట్యాంకులు వంటివిని 50 ఏళ్లుగా నడుస్తున్న ఈ సిస్టంను కంట్రోల్ చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నీటి సరఫరాల ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.

ఈ సమావేశంలో మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు (నాని), జాయింట్ కలెక్టర్ అసుతోష్ శ్రీవాత్సవ ,, జనసేన గుంటూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు , జి.ఎం.సి కమిషనర్ పులి శ్రీనివాసులు , కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు..

## రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి: ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**○ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**○ చిట్యాల ఐలమ్మ జయంతి రోజున రజకుల గళాన్ని అసెంబ్లీలో వినిపించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో శుక్రవారం జీరో అవర్‌లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. చిట్యాల ఐలమ్మ జయంతి రోజున ఎమ్మెల్యే గళ్ళా మాధవి రజకుల గళాన్ని అసెంబ్లీలో వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ "అధ్యక్షా, రిజర్వేషన్ లేకుండా అన్ని కులాలూ సమానంగా అభివృద్ధి చెందే రోజు రావాలని నా మనసులో ఎల్లప్పుడూ ఉంటుంది. కానీ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన కొన్ని కులాల అభ్యున్నతికి రిజర్వేషన్ ఒక పెద్ద ఊతం అవుతోంది. జనాభాలో 6% ఉన్న రజకులకు 2% కూడా విద్యా, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు రావట్లేదన్న వాస్తవం మన ముందుంది." అని అన్నారు. "దేశంలో 17 రాష్ట్రాల్లో రజకులు ఇప్పటికే ఎస్సీ జాబితాలో ఉన్నారు. రజకుల స్థితిని గమనించి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నందమూరి తారక రామారావు 1985లోనే కేంద్రానికి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని లేఖ రాశారు." అని గుర్తు చేశారు. "తరువాత 2018లో గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ విషయంలో గట్టి కృషి చేశారు. రజకుల ఆత్మగౌరవం, అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్న పార్టీ మన తెలుగుదేశం పార్టీ." అని తెలిపారు. "రజక జాతి ఆశీస్సులతో చట్టసభల్లో మొట్టమొదటిసారి గళం విప్పే అవకాశం ఇచ్చిన నా ప్రియతమ నాయకుడు, గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి నా పాదాభివందనాలు." అని అన్నారు. "రాష్ట్ర రజక జాతి బిడ్డల తరపున రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే ప్రతిపాదనను కేంద్రానికి పంపాలని ఈ సభ ద్వారా ముఖ్యమంత్రి వర్యులను అభ్యర్థిస్తున్నాను." అని విజ్ఞప్తి చేశారు. "ఈరోజు సాయుధ పోరాట యోధురాలు, రజకుల గౌరవప్రతీక, వీరనారి చిట్యాల ఐలమ్మ గారి 130వ జయంతి సందర్భంగా రాష్ట్ర రజకుల తరపున ఈ సభలో నివాళు లర్పిస్తున్నాను" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## కృపాదాస్‌కు ఉత్తమ ఉద్యోగ పురస్కారం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు వి.డి.వి.కృపాదాస్ కి గురువారం హైదరాబాదులో ఉమ్మడి రాష్ట్రాల సీడ్స్ మెన్ అసోసియేషన్ వారు ఉత్తమ ఉద్యోగి పురస్కారం అందించి ఘనంగా ప్రతిభకు పట్టం కట్టడమేనని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి. ధర్మ చరణ్,మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ లు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నిబద్ధతకు నిలువుటద్దం...ప్రతిభకు ప్రతిరూపమైన కృపాదాస్ ఈ గౌరవం అందుకోవడం గర్వకారణం అన్నారు. రైతులకు కృపాదాస్ విశేష సేవలు అందించారని ప్రశంసించారు. ఉత్తమ ఉద్యోగి పురస్కారం అందుకున్న కృపాదాస్ ను వేద సీడ్స్ తరఫున ఘనంగా సత్కరించారు.

## "పినపాడునందు ఫ్రైడే డ్రైడే ర్యాలీ"

**○ ర్యాలీని ప్రారంభించిన 26వార్డు కౌన్సిలర్ షేక్ ఇస్మాయిల్**



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి పట్టణ మారిస్ పేటలోని పినపాడునందు ఫ్రైడేడ్రైడే కార్యక్రమంలో భాగంగా మలేరియాశాఖ వారి ఆధ్వర్యంలో ఇంటింటిని సందర్శించి దోమల లార్వాలు పెరుగుటకు అవకాశం ఉన్న మూలాలను తొలగించి అనంతరం అవగాహన ర్యాలీని 26 వార్డు కౌన్సిలర్ షేక్ ఇస్మాయిల్ గారు ప్రారంభించారు. పినపాడు వైద్యాధికారి డాక్టర్ పరిశపోగు హనోక్ బాబు నందులపేట వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక సంయుక్తంగా మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని వాటి వలన దోమలు పెరిగి జ్వరాలు వచ్చే అవకాశం ఉందని తెలియజేస్తూ ఎవరికైనా అనుమానం జ్వరము అని అనుమానం ఉన్నచో వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునకు వచ్చి రక్త పరీక్ష చేయించుకొని, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలియజేశారు. తెనాలి సహాయమలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ నీటి నిలువ లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవగాహనతోనే దోమల నిర్మూలన సాధ్యమని ప్రజలు ఎక్కడ నీటిని నిలవలు లేకుండా చూసుకోవడం ద్వారా దోమల యొక్క ఉత్పత్తి తగ్గి వ్యాధుల వ్యాప్తిని అరికట్టడానికి అవకాశం కలుగుతుందని తెలిపారు. తెనాలి పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ప్రజలు ఇంటి లోపల ఇంటి బయట నీటి నిల్వలు లేకుండా చూసుకొనవలెనని ముఖ్యంగా ఇంటి లోపల ఉండే కూలర్లు ఫ్రిజ్జు మరియు రుబ్బురోలల్లో వర్షపు నీరు గాని లేక ఇతర నీటి నిల్వలు వల్ల కానీ దోమల సంఖ్య వృద్ధి చెందుతాయని తెలిపారు. అనగా చెక్ క్లీన్ అండ్ కవర్ విధానాల ద్వారా నీటిని నిలవలను పరిశీలించుకొని శుభ్రపరచుకొని వాటిపై మూతలు పెట్టుకొనడం ద్వారా దోమలు గుడ్లు పెడతానికి అవకాశం కలగదని తెలిపారు. ఈకార్యక్రమంలో సిడిపిఓ పూడి విజయగౌరీ, డిపిఎంఓ జంగం శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి అందెబాలచంద్రమౌళి, గ్రామీణ మలేరియాసబ్ యూనిట్అధికారి వంగల పున్నారెడ్డి, ఫైలేరియా ఎస్. హెచ్ఐ జి. రవికుమార్, మలేరియా ఆరోగ్య పర్యవేక్షకులు దీపాలశ్రీనివాసరావు, తిరువీధుల శివ రామప్రసాద్, ఆరోగ్య కార్యకర్తలుషేక్ రషీద్, సయ్యద్ కరీముల్లా, మున్నంగి రత్నాకరరావు, శానిటరీ సూపర్వైజర్ మైలా అప్పారావు, షేక్ బాషీద్,మహిళాఆరోగ్య కార్యకర్త తురుమెళ్ళనిర్మల, శ్రీదేవి,ఆశాకార్యకర్త బూరెలహేమలత, మాధవి, పి.శ్యామల, అంగన్వాడీ కార్యకర్తలు,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## జీజీహెచ్ లో మీకోసం మేము



**○ 32 వ వారం కార్యక్రమం**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో 32 వ వారం "జీజీహెచ్ లో మీకోసం మేము" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సూపరింటెండెంట్ డాక్టర్ రమణ ఎస్.ఎస్.వి ఆధ్వర్యంలో జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఎస్ఎన్ఎస్ఏ బృందం సభ్యులు "స్వస్థ నారి – శాసక్త పరివార" కార్యక్రమం కింద ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్యకర జీవన శైలికి నిత్యం చేతులు శుభ్రంగా కడుక్కోవటం, నీటిని కాచి వడపోసుకొని తాగడం అవసరమని సూచించారు. ఈ సందర్భంగా జాగృతి సంస్థ ఉచితంగా బియ్యం పంపిణీ చేసింది. కార్యక్రమంలో సిఎస్ఎస్ అడ్మినిస్ట్రేటర్, ఆర్.ఎమ్.ఒ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుండి వీణాఅవార్డ్స్, జాతీయ పంచమ నాటకోత్సవాలు



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్):** కళల కాణాచి సంస్థ, ఆర్ఎస్ఆర్ గ్రీన్ వే ఫౌండేషన్ సంయుక్త నిర్వాహణలో,జాతీయస్థాయి, వీణా అవార్డ్స్ పంచమ పద్య నాటక, సాంఘిక నాటక, నాటికల పోటీలు ఈనెల 27వ తేదీ నుండి కళాక్షేత్రం వేదికగా, దసరా మహోత్సవాల్లో కళాభిమానుల సంగమోత్సవంగా కన్నుల పండువగా వీనుల విందు,చేయ నున్నాయని కళల కాణాచి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, సినీ మాటల రచయిత సాయి మాధవ్ బుర్ర పేర్కొన్నారు. గాంధీ నగర్ లోని సిపిఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కళల కాణాచి సంస్థ నిర్వహించే వీణా అవార్డ్స్ నాటకోత్సవముల ప్రచార బ్రోచర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయి మాధవ్ బుర్ర మాట్లాడుతూ వధాన్యులైన ఎందరో కళాప్రోత్సాహక, అభిమానుల ప్రోత్సాహంతొ, కళలకు నెలవైన తెనాలిలో,ఈనెల 27వ తేదీ నుండి వరుసగా ఆరు రోజులు, అక్టోబర్ రెండవ తేదీ వరకు, ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి రాత్రి పది గంటల వరకు కళాభిమానులను అలరించే పద్యనాటకాలు, సాంఘీక నాటకాలు, నాటికలు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని, పంచనున్నాయని, ఎంపిక చేసిన నాటకముల వివరాలను వెల్లడించారు. తొలి రోజు కార్యక్రమం, ప్రారంభ సభలో, సాంస్కృతి సంస్థ అధ్యక్షులు, ప్రముఖ రంగస్థల నిర్వాహకులు, గుణ నిర్ణేత, గుంటూరు పట్టణ వాసి,సర్రాజు బాలచంద్రరావుకు, ఏ ఆర్ కృష్ణ జాతీయ రంగస్థలం పురస్కారాన్ని ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు మాట్లాడుతూ నాటక కళారంగానికి ఊతమిచ్చే దిశగా, కళల కాణాచి సంస్థను సాయి మాధవ్ బుర్ర ప్రారంభించారని, గత ఐదు సంవత్సరాలుగా, రంగస్థల, నాటక కళా రంగంలో అందిస్తున్న సేవలను వివరించారు. సినీ నటులు వేమూరి విజయభాస్కర్ మాట్లాడుతూ నాటక కళాపరిషత్తును నిర్వహించడం, మాటలు చెప్పినంత సులభం కాదని, ఆ బరువు బాధ్యతలను స్వీకరించి, ఎంతొ సమర్థవంతంగా జాతీయ కళాపరిషత్ ను వీణ అవార్డ్స్ పేరుతో నిర్వహిస్తూ తెనాలి ఖ్యాతిని, సాయిమాధవ్ ఇనుమడింప చేస్తున్నారనిఅన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు తాడిబోయిన హరిప్రసాద్, రంగస్థలం కళాకారుల సంఘం నాయకులు గరికపాటి సుబ్బారావు, సిపిఐ నాయకులు చెరుకుమల్లి సింగారావు, బెల్లంకొండ వెంకట్, దేవరపల్లి భవాని, సుభాష్ చంద్రబోస్, బడుగు మోహన్ రావు, హకీమ్ జానీ, కనపర్తి మధుకర్,సుబ్రహ్మణ్యం తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# జిఎస్టి 2.0 ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి : కలెక్టర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వస్తుసేవల పన్ను తగ్గింపు జిఎస్టి 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు.

వస్తుసేవల పన్ను తగ్గింపు జిఎస్టి 2.0 ప్రయోజనాలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దసరా నుండి దీపావళి వరకూ ప్రత్యేక ప్రచార అవగాహన కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ నెల 22 నుండి అమలులోకి వచ్చిన జిఎస్టి 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు దసరా నుండి దీపావళి వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని, అందులో వివిధ శాఖలకు సంబంధించి క్షేత్ర స్థాయి వరకూ ఈ కార్యక్రమాన్ని తీసుకువెళ్ళి విజయవంతంగా నిర్వహించాలన్నారు. జిఎస్టి 2.0 వలన ప్రజలకు లబ్ది చేకూరుతున్న నేపథ్యంలో దీపావళి ముందు రోజు అక్టోబరు 19వ తేదీ వరకూ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో వివిధ అవగాహనా కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు. సామాన్య ప్రజలకు గృహ, నిత్యావసర వస్తువులు, ఆహారం, మందులు, విద్యా, స్టేషనరీ, బట్టలు, క్రీడా వస్తువులు, మహిళలు, పిల్లలు, రవాణా అంశాలకు సంబంధించి జిఎస్టి తగ్గింపు వల్ల ప్రయోజనం కలుగుతుందన్నారు. సెప్టెంబరు 30 నుండి అక్టోబరు 6 వరకూ వ్యవసాయం మరియు ఇతర వృత్తులలో ఉన్నవారు – వ్యవసాయ, ఉద్యానవన, ఉపాధిహామీ కూలీలు, మత్స్యకారులు, ఆక్వా రైతులు, ట్రేడింగ్ ఎంఎస్ఎంఇలు, నేత, హస్త కళాకారులు, పేపరు – ప్యాకేజింగ్, సెలూన్లు, స్పా, యోగా కేంద్రాలు, జిమ్, టెక్స్‌టైల్స్ రంగాల్లో పనిచేసే వారికి, అక్టోబరు 7నుండి 13 వరకు మానవ వనరుల అభివృద్ధి, డిజిటల్ సాంకేతికకు సంబంధించిన విద్య, జీవితబీమా, ఆరోగ్య బీమా, ఎలక్ట్రానిక్స్, ఎంట్రప్రెన్యూర్ షిప్పు, ఇ–కామర్స్ అండ్ గిగ్ ఎకానమీ కి సంబంధించిన అవగాహన కార్యక్రమాలు, అక్టోబరు 14 నుండి 18 వం–కూ వికాస్ విస్వాస్ – నమ్మకమైన అభివృద్ధికి సంబంధించి బిల్డింగ్డె వలపర్స్, కనస్ట్రక్షన్ మెటీరియల్, టూరిజం – హాస్పిటాలిటీ, టాన్సుపోర్టు, లాజిస్టిక్స్, బొమ్మలు, స్పోర్ట్సు గూడ్స్, రెన్యువల్ ఎనర్జీ, ఆటోమొబైల్, మాన్యూఫ్యాక్చరింగ్ రంగాల్లో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లా స్థాయిలో జెసి నోడల్ అధికారిగా, సంబంధిత శాఖల జిల్లా అధికారి వారి శాఖ జిఎస్టి చాంపియన్ గాను, అసెంబ్లీ నియోజవర్గ స్థాయిలో ప్రత్యేక అధికారి, మండల స్థాయిలో ఎంపిడిఓ, మున్సిపల్ కమీషనర్, గ్రామ వార్డు సచివాలయాల స్థాయిలో పంచాయితీ, వార్డు అడ్మిన్ కార్యదర్శి జిఎస్టి చాంపియన్ గా ఉంటారని తెలిపారు. కార్యక్రమాల నిర్వహణ షెడ్యూల్ తయారు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, నగర పాలక కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, జి.ఎస్.టి జాయింట్ కమిషనర్ గీతా మాధురి, సహాయ కమిషనర్ ఆర్.అనసూయ, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, జిల్లా విద్యా శాఖ అధికారి రేణుక, జిల్లా వ్యవసాయ అధికారి ఏ.నాగేశ్వర రావు, ంతదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## అభివృద్ధి,సంక్షేమం,విశ్వసనీయత కూటమి ప్రభుత్వ లక్షణాలు



○ శాసనమండలిలో మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శాసనమండలిలో వైసీపీపై నిప్పులు చెరిగారు. ప్రజల గుండెల్లో ఓటమి ముద్ర వేసుకున్న వైసీపీ, కూటమి ప్రభుత్వ విజయాలను విమర్శించడాన్ని హాస్యాస్పదం అని మంత్రి విమర్శించారు.

అభివృద్ధి, సంక్షేమం, విశ్వసనీయత కూటమి ప్రభుత్వ లక్షణాలు. కానీ ద్రోహం, అవినీతి, అహంకారం వైసీపీ అసలు స్వరూపం. వైసీపీ వైఫల్యాలను దాచుకునేందుకు కూటమి విజయాలపై మట్టి చల్లే ప్రయత్నాలు చేస్తున్నారని అచ్చెన్నాయుడు అన్నారు. గత ఐదు సంవత్సరాల్లో రాష్ట్ర ఆర్థిక విధ్వంసం సృష్టించి, 9.5 లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసిన వైసీపీకి ఉద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కులేదని మంత్రి చెప్పారు. ప్రతి శాఖలో అప్పులు ఉన్నాయని విమర్శించారు.

"అద్భుతమైన అన్నా క్యాంటిన్ ను తొలగించవద్దని అసెంబ్లీలో జగన్‌ను మనం హెచ్చరించాము, కానీ ఫలితం లేదు. పేదలకు 5 రూపాయల భోజనాన్ని దూరం చేశారు." అని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు .వైసీపీ హయాంలో రైతు భరోసా పథకం ద్వారా రైతులను మోసం చేసినట్టు, కేంద్రం మరియు రాష్ట్రం కలిసి ఇచ్చిన 12,500 రూపాయల పెట్టుబడి సహాయాన్ని కూడా దూరంగా పెట్టారని అచ్చెన్నాయుడు హేతుపూర్వకంగా గుర్తుచేశారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ఇస్తామని నిరుద్యోగుల్ని ముంచెత్తారని, ఇప్పుడు 'నీతులు' గురించి మాట్లాడుతున్న వైసీపీ పై ఆయన సిగ్గు పెట్టాల్సిందిగా ప్రశ్నించారు.

ప్రజలు వైసీపీని తిరస్కరించారంటూ, "మంచి సలహాలు ఇవ్వడం నేర్చుకోండి" అని హెచ్చరించారు. వైసీపీ కార్యకర్తలకు వాలంటీర్ల ఉద్యోగాలు ఇచ్చి, అధికారంలో ఉన్నప్పుడు వాటిని రెన్యూవల్ చేయలేక చేతులు ఎత్తారని మళ్లీ విమర్శలు చేశారు. గత ప్రభుత్వంలో స్థానిక ఎన్నికల్లో నామినేషన్లకు అవకాశం లేదు, కానీ కూటమి ప్రభుత్వంలో అన్ని పార్టీలు ప్రజాస్వామ్యబద్ధంగా నామినేషన్లు పెట్టుకున్నారని చెప్పారు.

ముఖ్యంగా, కూటమి ప్రభుత్వ హామీలు విజయవంతంగా అమలులో ఉన్నట్లు, అన్నదాత సుఖీభవ్ పథకం ద్వారా 47 లక్షల రైతులకు సహాయం అందించామని, 3 లక్షల కౌలీ రైతులకు రెండవ విడతలో 10,000 రూపాయలు అందజేయబోతున్నట్లు మంత్రి తెలిపారు.

## 4గోదావరి తీరప్రాంత సమస్యలపై అసెంబ్లీలో చర్చ



○ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి సమాధానాలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** అసెంబ్లీలో గోదావరి తీరప్రాంతంలో ఓఎన్జీసీ, గెయిల్ కారణంగా తలెత్తుతున్న సమస్యలను సభ్యులు ప్రస్తావించారు. ఎమ్మెల్యేలు గిడ్డి సత్యనారాయణ, దేవవరప్రసాద్ మాట్లాడుతూ స్థానికంగా భూమి కుంగిపోవడం, మురుగు నీరు డ్రెయిన్లు సముద్రంలోకి వెళ్లకుండా పొంగిపోవడం, అలాగే కాలుష్యం పెరుగుతున్న అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక పరిస్థితులపై అధికారుల నివేదికలు తీసుకుని అందుకు అనుగుణంగా చర్యలు చేపడతామని తెలిపారు. ఆయా సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులను స్థానిక అభివృద్ధి కోసం వినియోగించడం లేదన్న సభ్యుల ఆరోపణలపై కూడా నివేదికలు తెప్పించి, అవి నిజమని తేలితే సంస్థలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**ఉద్యోగాల అంశంపై మంత్రి సమాధానం :** పి.గన్నవరం నియోజకవర్గంలో స్థానికులకు ఉద్యోగాలు రిజర్వ్ చేసే ప్రతిపాదన ఉందా అన్న సభ్యుడు గిడ్డి సత్యనారాయణ ప్రశ్నకు మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి సమాధానమిచ్చారు. ఆయన మాట్లాడుతూ ఓఎన్జీసీ, గెయిల్ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో నియామకాలు అఖిల భారత స్థాయిలో జరుగుతాయని, స్థానికుల కోసం ప్రత్యేక రిజర్వేషన్లు ఉండవని స్పష్టం చేశారు.

ప్రస్తుతం గెయిల్ తాటిపాక స్థావరంలో పనిచేస్తున్న 7 మంది రెగ్యులర్ ఉద్యోగులలో 6 మంది ఆంధ్రప్రదేశ్‌కు, ఒకరు తెలంగాణకు చెందినవారని తెలిపారు. అక్కడ పనిచేస్తున్న 67 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులంతా ఆంధ్రప్రదేశ్ వారేనని వివరించారు.

ఓఎన్జీసీ తాటిపాక కాంప్లెక్స్‌లో ప్రస్తుతం 65 మంది రెగ్యులర్ ఉద్యోగులలో 41 మంది ఆంధ్రప్రదేశ్ వారు, 24 మంది ఇతర రాష్ట్రాలకు చెందినవారని తెలిపారు. అలాగే 144 మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో 135 మంది స్థానిక ఆంధ్రప్రదేశ్ వారే ఉన్నారని చెప్పారు.

రాజమండ్రి ఓఎన్జీసీ ఆసెట్ సెక్షన్ కింద పనిచేస్తున్న 1800 మంది అవుట్‌సోర్స్ ఉద్యోగులలో 1600 మంది ఆంధ్రప్రదేశ్ వారికి చెందినవారని, 200 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారని మంత్రి వివరించారు.

మంత్రి మాట్లాడుతూ, స్థానిక ఉద్యోగ అవకాశాల కోసం ప్రత్యేక నిబంధనలు లేవని, కానీ కాంట్రాక్ట్ స్థాయిలో ఎక్కువగా స్థానికులకే ఉపాధి లభిస్తున్నదని స్పష్టం చేశారు.

## ఝార్ఖడ్ లో హ ట యోగ భీష్మణి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఝార్ఖండ్‌లోని లాతెహార్ జిల్లా మధువాఖడ్ గ్రామానికి చెందిన అనీశాకుమారి (15) అనే ఈ బాలిక దేవీ నవరాత్రుల్లో ఉపవాసాలు చేస్తూ కఠినదీక్ష చేపట్టింది. ఇనుప మేకుల మంచంపై నిద్రపోతున్న ఈమె ఉదయం, సాయంత్రం ప్రతిరోజు రెండు గంటలపాటు జ్యోతి ప్రజ్వలన చేసిన కలశం పొట్టపై పెట్టుకొని పూజిస్తోంది. నవరాత్రులు మొదలయ్యే ముందే అనీశా ఈ కోరిక వెలిబుచ్చిందని, తనకు ఈ ఆలోచన ఎలా వచ్చిందో తెలియదని తల్లి సీమాదేవి తెలిపారు.

కుమార్తె కోరిక మేరకు 32 కిలోల ఇనుప మేకులతో మంచం తయారు చేయించామన్నారు. నవరాత్రుల సమయంలో అమ్మవారి అనుగ్రహం పొందడానికి భక్తులు పలు రకాలుగా కఠిన ఉపవాస దీక్షలు చేస్తారని స్థానిక పండితుడు సంతోశ్ మిశ్ర తెలిపారు. అనీశా చేస్తున్న విధానాన్ని హఠ యోగ దీక్ష అంటారన్నారు.

# శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ అక్రమాలపై విచారణ

○ **100రోజుల్లో నివేదిక రప్పించి బాధ్యులపై చర్యలు చేపడతాం**

○ **యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీ వందరోజుల కార్యాచరణ ప్రణాళిక**

○ **అసెంబ్లీలో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీలో 2019-24 నడుమ కంప్యూటర్ల కొనుగోలులో దుర్వినియోగం, యూనివర్సిటీ వాహనాలను వ్యక్తిగత అవసరాలకు వినియోగించడం, నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు, నియామకాలు, రిక్రూట్ మెంట్ లో రూల్స్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడంపై ఎంక్వయిరీ కమిటీ వేస్తాం, వందరోజుల్లో నివేదిక తెప్పించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. 7వరోజు అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో శాసనసభ్యులు ఎంఎస్ రాజు, పల్లె సింధూర రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ... పారదర్శకంగా విశ్వవిద్యాలయాలు నడిపించాలనే లక్ష్యంతో ప్రజాప్రభుత్వం ఉంది. నిన్న ఎయులో ఒక విద్యార్థి ఫిట్స్ తో చనిపోయారు, అంబులెన్స్ ఉన్నా ఆ విద్యార్థిని కాపాడుకోలేకపోయాం. దాని వెనుక ఏదో ఉందని, కావాలని కొన్ని స్టూడెంట్స్ యూనియన్లు పాతాలు జరగకుండా అడ్డుకోవడం బాధాకరం. ఏదైనా సమస్య ఉంటే ప్రభుత్వం వినడానికి సిద్ధంగా ఉంది, తప్పు జరిగితే సరిదిద్దుకోవడానికి సిద్ధంగానే ఉన్నాం. ప్రభుత్వపరంగా ఎలాంటి తప్పు లేకపోయినా రాజకీయాలు చేయడం సరికాదు. ఉన్నత విద్యను కలసికట్టుగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఇందులో విద్యార్థి సంఘాలు కూడా భాగస్వాములు కావాలి. మెరుగైన విద్య, కరిక్యులమ్ పై చర్చిద్దాం. రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా యూనివర్సిటీ విసిలను నియమిస్తున్నాం. ఆంధ్రా యూనివర్సిటీని టాప్ - 100 వర్సిటీలో ఒకటిగా తీర్చిదిద్దే బాధ్యతను ముఖ్యమంత్రి గారు నాకు అప్పగించారు. కొంతమంది వారి స్వార్థం కోసం కావాలని విశ్వవిద్యాలయాల్లో గొడవలు సృష్టించడం బాధాకరం. సమస్యలపై విద్యార్థి సంఘాలతో చర్చించి, పరిష్కరించడానికి విసి నుంచి నావరకు అందరం సిద్ధంగా ఉన్నాం. ఉద్దేశ్యపూర్వకంగా విశ్వవిద్యాలయాల్లో గొడవలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ తెలిపారు. మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా డిగ్రీ కళాశాలల్లో కోర్సులను రూపొందించాల్సిన అవసరం ఉంది, ఇందుకోసం సీరియస్ గా కసరత్తు చేస్తున్నామని మంత్రి లోకేష్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీల్లో 3,282 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అనేక కోర్టు కేసుల కారణంగా విశ్వవిద్యాలయాల్లో రిక్రూట్ మెంట్ జరగని మాట వాస్తవం. వందరోజుల యాక్షన్ ప్లాన్ తీసుకొని న్యాయపరమైన చిక్కులను తొలగించి, పకడ్బందీ నోటిఫికేషన్ ద్వారా యూనివర్సిటీల్లో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ చెప్పారు.

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ... ఎటువంటి రాజకీయ ప్రమేయం లేకుండా విశ్వ విద్యాలయాలకు విసిలను నియమించినందుకు లోకేష్ కు ధన్యావాదాలు. 2019-24 మధ్య వైస్ చాన్సలర్లు యూనివర్సిటీలను వైసిపి పార్టీ కార్యాలయాలుగా మార్చారు. ఎస్ కెడి వర్సిటీ మాజీ విసి రామకృష్ణారెడ్డి నాటి ముఖ్యమంత్రి అండతో కోట్ల రూపాయల అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. కోట్లరూపాయల అవినీతి అక్రమాలకు పాల్పడ్డారు. వందకంప్యూటర్లు చోరీ అ-య్యాయని ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వ వాహనాలను రిజిస్ట్రార్, రెక్టార్ విహారయాత్రలకు వాడుకున్నారు. ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా 21 అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు. మాజీ విసి కుసుమకుమారి వాటిని ర్యాటిఫై చేశారు. నిబంధనలకు విరుద్ధంగా చేశారని ఆమెను సస్పెండ్ చేశారు. దీనిపై విద్యార్థిసంఘాలు కూడా కోర్టుకు వెళ్లాయి. ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ హేమచంద్రారెడ్డి వత్తిడికి తలొగ్గి 23-8-2022న రిజిస్ట్రార్ ఇంప్లీడ్ పిటిషన్ కు విరుద్ధంగా 21 అసిస్టెంట్ ప్రొఫెసర్లను అసోసియేట్ ప్రొఫెసర్లుగా నియమించారు. రిజర్వేషన్ పాటించకపోవడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బిసిలకు అన్యాయం జరిగింది. యూనివర్సిటీల్లో 2019-24 నడుమ రాజకీయ కార్యకలాపాలు నెరపిన విసిలపై చర్యలు తీసుకోవాలని ఎంఎస్ రాజు కోరారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ... ఎస్ కె యూనివర్సిటీ లో టీచింగ్ పోస్టులు 235కి గాను 40 మాత్రమే భర్తీచేశారు, 185 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 2014-19 నడుమ ఎస్ కె వర్సిటీలో 4వేల పైచిలుకు అడ్మిషన్లు ఉండగా, ఇప్పుడు 800కి పడిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీకళాశాలల్లో 34శాతం మాత్రమే అడ్మిషన్లు ఉన్నాయి. ఎస్ కె వర్సిటీలో టైమ్ స్కేల్, మినిమమ్ స్కేల్ తో గత 25 ఏళ్లుగా 280మంది పనిచేస్తున్నారు. వారిని రెగ్యులర్ చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు.

# చెస్‌ను ప్రపంచానికి పరిచయం చేసింది మనమే

○ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని వెల్లడి

○ విజ్ఞాన్స్ వర్సిటీలో ఘనంగా కొనసాగుతున్న 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** చెస్ ఆట వ్యూహాత్మక ఆలోచన, క్రమశిక్షణ, నిర్ణయ సామర్థ్యాలను పెంపొందిస్తుంది. ఇది వినయాన్ని, ఓటమిలో గౌరవాన్ని నేర్పుతుంది. ఈ ఆటను ప్రపంచానికి పరిచయం చేసింది మన దేశమేనని రూరల్ డెవలప్‌మెంట్ మరియు కమ్యూనికేషన్ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ అన్నారు. ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో "62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు" ఘనంగా జరుగుతున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రూరల్ డెవలప్‌మెంట్ మరియు కమ్యూనికేషన్ కేంద్ర సహాయ మంత్రి వర్యులు డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ ముందుగా గ్రాండ్ మాస్టర్ ఎంఆర్ లలిత్‌బాబుతో ఒక ఎత్తు వేసి ఆటను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ ఈ ఆటను ఆడుతున్నారని తెలిపారు. మహాభారతం కాలం నుండి నేటి వరకూ భారతదేశానికి చెస్ క్రీడలో గొప్ప మేధో సంపద, చారిత్రక వారసత్వం ఉన్నదిన్నారు. చెస్ ఆటకు ఆవిర్భావం జరిగిన దేశం కూడా భారత్ అనే విషయం అందరికీ తెలిసిందేనని, గుప్త వంశం కాలంలో చెస్ ఆవిష్కరించబడిందన్నారు. మన గౌరవనీయ ప్రధానమంత్రి రాష్ట్ర ముఖ్యమంత్రి ఇద్దరూ అత్యంత ప్రగతిశీల దృష్టితో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 10-15 సంవత్సరాల క్రితం వరకు క్రీడలకు అంత ప్రాముఖ్యత ఇవ్వకపోయినా, ఇప్పుడు 2047 విశ్వగురు భారత్ లక్ష్యంగా, భారతదేశాన్ని ప్రతి క్రీడలో అగ్రగామి చేయడానికి అనేక పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఖేలో ఇండియా కార్యక్రమం, ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన జాతీయ క్రీడల బిల్లు, ఇవన్నీ భారత క్రీడాకారులు ప్రపంచ వేదికపై విజయం సాధించేందుకు ఉద్దేశించిన చర్యలేనని వెల్లడించారు. ప్రస్తుతం ఇవి ప్రతిపాదనల దశలో ఉన్న పథకాల్లో భాగంగా, జిల్లాలలో చిన్న స్థాయి క్రీడా కేంద్రాలు, రాష్ట్ర రాజధానులలో పెద్ద స్థాయి క్రీడా సముదాయాలు, అలాగే 3-4 నగరాల మధ్య ఒలింపిక్ స్థాయి గ్రాండ్ సెంటర్లు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయన్నారు. దీనికి వేల కోట్ల రూపాయల పెట్టుబడి క్రీడా మౌలిక వసతుల కోసం కేటాయించబడుతుంది. ఈ ప్రక్రియలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ) నుండి ముఖ్యమైన ఆర్థిక మద్దతు అందుతోందున్నారు. ఈ ప్రతిష్టాత్మక చెస్ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న విజ్ఞాన యూనివర్సిటీకి, సహకరించిన ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఇలాంటి టోర్నమెంట్‌ల ద్వారా కోనేరు హంపి, ప్రగ్యానంద, విశ్వనాథన్ ఆనంద్ వంటి మేధావులు వెలుగులోకి వచ్చారన్నారు. ఇక్కడ పాల్గొంటున్న ఆటగాళ్లలో కూడా భవిష్యత్తులో అటువంటి మహానుభావులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్య అతిథిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

ఐదో రౌండ్ ఫలితాలు

2013 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో విశ్వనాథన్ ఆనంద్‌కు సెకండ్‌గా ఉన్న, నాలుగు సార్లు జాతీయ చాంపియన్‌గా నిలిచిన జీఎం కృష్ణన్ సశికిరణ్, రైల్వేల అత్యధిక రేటింగ్ కలిగిన ఇంటర్నేషనల్ మాస్టర్ అరోన్యక్ ఘోష్తో కలిసి ఐదు రౌండ్లలో ఐదు పాయింట్లతో అగ్రస్థానంలోకి దూసుకెళ్లారు. వీరి వెనుక తొమ్మిది మంది ఆటగాళ్లు 4.5 పాయింట్లతో పోటీలో కొనసాగుతున్నారు.

నిమ్జోవిచ్-లార్సెన్ ఆరంభంలో కేరళ యువ ఐఎం హెచ్. గౌతమ్ కృష్ణ చేసిన 39వ మూవ్ లోపాన్ని సశికిరణ్ మొదట వాడుకోలేకపోయినా, తర్వాత క్వీన్, రూక్, బిషప్‌లతో దాడి విరుచుకుపడ్డాడు. ప్రత్యర్థి నైట్ కదలలేని స్థితికి చేరడంతో గౌతమ్ లొంగిపోవాల్సి వచ్చింది. కారో-కాన్ డిఫెన్స్‌లో అన్ని మైనర్ పీసులు, క్వీన్లు మారిన తర్వాత, అరోన్యక్ ఘోష్కు సులభ విజయం దక్కింది. కశిష్ మనోజ్ జైన్ స్వచ్ఛందంగా రూక్ మార్పు చేసిన తర్వాత 44వ మూవ్‌లో పాన్ ప్రమోషన్ అడ్డుకోలేక జైన్ రాజీనామా చేశాడు.

ఉత్కంఠభరిత పోరులో జీఎం ఎస్.పి. సేతురామన్, ఢిల్లీ ఐఎం ఆదీ అమేయపై బిషప్ త్యాగంతో విజయ దిశగా సాగినా, ఒక రూక్ తప్పిదం వల్ల స్థితి చేజారింది. అమేయ ధీటుగా పోరాడి, పైచేయి సాధించే స్థితికి వచ్చినా, చివర్లో వరుస తప్పిదాల కారణంగా గేమ్ 79 మూవ్‌ల తర్వాత డ్రాగా ముగిసింది.

జీఎం సూర్యశేఖర్ గంగూలీ , జీఎం లలిత్ బాబు తో క్వీన్స్ గాంబిట్ ఆడి, 30 మూవ్‌ల తర్వాత డ్రాకు అంగీకరించారు. టాప్ సీడ్ పీ. ఇనియన్ (తమిళనాడు) కూడా కర్ణాటక ఐఎం వియాని ఆంటో డికున్హాపై గెలవలేక, ఒకే రంగు బిషప్ ఎండ్‌గేమ్‌లో 40 మూవ్‌ల తర్వాత డ్రా చేసుకున్నాడు.

పుదుచ్చేరి ఐఎం ఎల్. శ్రీహరి, లిలిఅజయ్ సంతోష్ పర్వతరెడ్డి (ఉ.ప్ర.)తో గేమ్‌లో పాన్ పట్టుకుని తన క్వీన్‌ను రూక్ దాడికి బలిచేశాడు. సమాన స్థితి నుంచి అజయ్ ఆధిక్యంలోకి వెళ్ళినా, వెంటనే తానే పొరబడటంతో మళ్లీ పరిస్థితి మారింది. చివరికి వరుస తప్పిదాల తరువాత శ్రీహరి రాజీనామా చేశాడు.

ఐదు సార్లు జాతీయ విజేత జీఎం అభిజీత్ గుప్తా, తమిళనాడు ఛాంపియన్ బి. విజయేష్పై ఏడో వరుసలో శక్తివంతమైన పాన్ ఆధిక్యంతో సులభ విజయం సాధించాడు.

ఆంధ్ర ఆటగాడు, రైల్వేల ఐఎం ఎస్. రవితేజ, ప్రపంచ అమెచ్యూర్ రజత పతక విజేత ఏ. కుమారేష్ (తమిళనాడు)పై విజయాన్ని కొనసాగించాడు. బిషప్ వర్సెస్ నైట్ ఎండ్‌గేమ్‌లో రవి పాన్ ప్రమోషన్ అడ్డుకోలేక కుమారేష్ రాజీనామా చేశాడు.

తమిళనాడుకు చెందిన జీఎం ఎలెక్ట్ రోహిత్ ఎస్. కృష్ణ, రైల్వేల ఐఎం సుభయన్ కుందుతో రూక్-పాన్ ఎండ్‌గేమ్‌లో డ్రా చేశాడు. ముఖ్య ఫలితాలు - ఐదో రౌండ్

లలిత్ బాబు ఎం.ఆర్. ( 4½ - 4½ డ్రా - సూర్యశేఖర్ గంగూలీ ,హెచ్. గౌతమ్ కృష్ణ 4 - 5 ఓటమి - కృష్ణన్ సశికిరణ్ ,కశిష్ మనోజ్ జైన్ 4 - 5 ఓటమి - అరోన్యక్ ఘోష్, ఎస్.పి. సేతురామన్ 4- ½ డ్రా - ఆడీ అమేయ, వియాని ఆంటో డికున్హా 4 - 4 డ్రా -పి. ఇనియన్ అభిజీత్ గుప్తా 4½ - 3½ గెలుపు - బి. విజయేష్, సుభయన్ కుందు 4 - 4 డ్రా - రోహిత్ ఎస్. కృష్ణ, అజయ్ సంతోష్ పర్వతరెడ్డి 4½- 3½ గెలుపు -ఎల్. శ్రీహరి ఎస్. రవితేజ 4½- 3½ గెలుపు - ఏ. కుమారేష్, దీపన్ చక్రవర్తి జె. ) 4½- 3½ గెలుపు - అంకిత్ రే ఆదిక్ థెఫేన్ లెనిన్ 3½- 4½ ఓటమి - ఆదిత్య దింగ్రా ఇలా పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారి వివరాలు వెల్లడించారు.

# జిఎస్టి 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి:సిఎస్ విజయానంద్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వస్తుసేవల పన్ను తగ్గింపు జిఎస్టి 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు నెల రోజుల పాటు ప్రత్యేక ప్రచార అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలక్టర్లను ఆదేశించారు. సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ పై నెల రోజుల సెలబ్రేషన్స్ కార్యక్రమం, సీజనల్ కండిషన్స్, పిఎం సూర్యఘర్, కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లు, సోలార్, విండ్ ప్రాజెక్టులకు భూ సంబంధిత అంశాలపై శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ జూన్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్టే ఈనెల 22 నుండి అమలులోకి వచ్చిన జిఎస్టి 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు దసరా నుండి దీపావళి వరకు నెలరోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక ప్రచార అవగాహనా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈకార్యక్రమాన్ని ఏవిధంగా నిర్వహించాలనే దానిపై ఇప్పటికే జిఓను జారీ చేశామని ఆప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కలక్టర్లను ఆయన ఆదేశించారు. జిఎస్టి 2.0 వల్ల రాష్ట్రానికి సుమారు 8 వేల కోట్ల రూ.లు ఆదాయం తగ్గుతున్నప్పటికీ ప్రతి కుటుంబానికి 10 నుండి 15 శాతం సొమ్ము ఆదా అవుతున్న నేపధ్యంలో ప్రభుత్వం జిఎస్టి 2.0ను స్వాగతించడం జరిగిందన్నారు. జిఎస్టి తగ్గింపు వల్ల ఏవిధంగా లబ్ది కలుగుతుందనే దానిపై ప్రజలకు విస్తృతంగా తెలియజేసి వారిలో పూర్తి అవగాహన కల్పించేందుకు నెలరోజుల కార్యక్రమాన్ని అనగా అక్టోబరు 19వ తేదీ వరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిఎస్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాలు, మండల, అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో అవగాహనా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని సిఎస్ విజయానంద్ కలక్టర్లను ఆదేశించారు.

రాష్ట్ర చీఫ్ కమీషనర్ ఆఫ్ స్టేట్ టాక్సెస్ బాబు మాట్లాడుతూ 5 స్లాబులుగా ఉండే జిఎస్టిని రెండు స్లాబులకు తగ్గించి జిఎస్టి 2.0 ను ఈనెల 22 నుండి అమలులోకి తేడవం జరిగిందని వివరించారు. ఆ ఒక్కరోజే దేశవ్యాప్తంగా 11 లక్షల ఆన్లైన్ ట్రాన్సాక్సన్లు జరిగాయని చెప్పారు. పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నెలరోజుల కార్యక్రమం వివరాలను తెలియజేస్తూ ఈనెల 25 నుండి 29 వరకూ ఇంటింటికీ జిఎస్టి ఫలాలు పేరిట ప్రచార కార్యక్రమంలో భాగంగా సామాన్య ప్రజలకు గృహ, నిత్యావసర వస్తువులు, ఆహారం, మందులు, విద్యా, స్టేషనరీ, బట్టలు, క్రీడా వస్తువులు, మహిళలు, పిల్లలు, రవాణా అంశాలకు సంబంధించి జిఎస్టి తగ్గింపు వల్ల కలిగే లబ్దిపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. అదే విధంగా సెప్టెంబరు 30 నుండి అక్టోబరు 6 వరకూ వ్యవసాయం మరియు ఇతర వృత్తుల వారికి అనగా వ్యవసాయ, ఉద్యాన వన, ఉపాధిహామీ కూలీలు, మత్స్యకారులు, ఆక్వారైతులు, ట్రేడింగ్ ఎంఎస్ఎంఇలు, నేత, హస్త కళాకారులు ,పేపరు మరియు ప్యాకేజింగ్, సెలూన్లు, స్పా, యోగా కేంద్రాలు, జిమ్, టైక్స్ టైల్స్ రంగాల్లో పనిచేసే వారికి అవగాహన, ట్రాక్టర్ ర్యాలీలు, మేళాలు, ఎగ్జిబిషన్ల నిర్వహణ చేపట్టాల్సి ఉందని తెలిపారు. అదే విధంగా అక్టోబరు 7నుండి 13 వరకూ మానవ వనరుల అభివృద్ధి మరియు డిజిటల్ సాంకేతికతకు సంబంధించి విద్య, జీవిత బీమా మరియు ఆరోగ్య బీమా, ఎలక్ట్రానిక్స్, ఎంట్రప్రెన్యూర్ షిప్పు, ఇ-కామార్స్ అండ్ గిగ్ ఎకానమీ కి సంబంధించిన అవగాహన కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు, జిల్లా స్థాయిలో మాన్యుఫ్యాక్చర్లు, డీలర్లచే ఎగ్జిబిషన్లు, ద్విచక్ర వాహనాల ర్యాలీలు, సెమినార్లు వంటి కార్యక్రమాలు చేయాల్సి ఉందన్నారు. అక్టోబరు 14న జిల్లా, మండల, నియోజకవర్గ కేంద్రాల్లో వికాస్ విస్వాస్ -నమ్మకమైన అభివృద్ధికి సంబంధించి బిల్డింగ్, డెవలపర్స్ మరియు కనస్ట్రక్షన్ మెటీరియల్స్ పై ఎగ్జిబిషన్లు, టూరిజం హాస్పిటాలిటీకి సంబంధించి టూరిస్ట్ ఏజెంట్లు, బడ్జెట్ హోటళ్లచే సాండ్ ఆర్ట్, ఫ్లాస్ మాబ్స్ వంటివి నిర్వహించాలని చెప్పారు. 15న ట్రాన్సుపోర్టు, లాజిస్టిక్స్ కు సంబంధించి చిన్న వాహనాల ర్యాలీ, 16న స్పోర్ట్సు గూడ్స్, రెన్యువల్ ఎనర్జీ, ఆటోమొబైల్ మరియు మాన్యు ఫ్యాక్చరింగ్ రంగాల్లో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన, బైక్ ర్యాలీలు వంటివి నిర్వహించాలని చెప్పారు. దీపావళి పర్వదినానికి ముందు రోజైన అక్టోబరు 19వ తేదీన నెలరోజుల కార్యక్రమం ముగింపు కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందని బాబు ఎ వివరించారు. ఈనెల రోజుల్లోను రాష్ట్ర వ్యాప్తంగా 65వేల ఈవెంట్లను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల రోజుల కార్యక్రమం వివరాలన్నీ వీడియో, ఫొటోలను వైబ్ సైట్లో పెట్టాలని చెప్పారు.

అదే విధంగా ఈప్రచార కార్యక్రమం పర్యవేక్షణ విజయవంతంగా నిర్వహణకు ఎస్టి చాంపియన్స్ పేరిట జిల్లా స్థాయిలో జెసి నోడలు అధికారిగా జిల్లా జిఎస్టి చాంపియన్ గా, సంబంధిత శాఖల జిల్లా అధికారి వారి శాఖ జిఎస్టి చాంపియన్ గాను, అసెంబ్లీ నియోజవర్గ స్థాయిలో ప్రత్యేక అధికారి, మండల స్థాయిలో ఎంపిడిఒ, మున్సిపల్ కమీషనర్, గ్రామ వార్డు సచివాలయాల స్థాయిలో పంచాయితీ, వార్డు అడ్మిన్ కార్యదర్శి జిఎస్టి చాంపియన్ గా ఉంటారని చీఫ్ కమీషనర్ బాబు ఎ తెలిపారు. అంతేగాక ఈనెల రోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ప్లాట్ ఫారమ్ లు, హోర్డింగ్లు, ఇతర ఔట్ డోర్ ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. 24 గంటలు పనిచేసే జిఎస్టి హెల్పు డెస్క్ ను జిఎస్టి కార్యాలయాల్లో ఏర్పాటు చేయడం జరిగిందని అదే రీతిలో మిగతా కార్యాలయాల్లో కూడా ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు. ఈసమావేశంలో ఆర్టీజిఎస్ సిఇఒ మరియు డైరెక్టర్ ఐఅండ్పిఆర్ ప్రఖర్ జైన్, నెడ్ క్యాప్ ఎండి కమలాకర్ బాబు, జిఎస్టి అధికారులు పాల్గొన్నారు. వర్చువల్ గా జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

6.7

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467